# సైతాను నెదిరించు సూత్రములు

## ప్రారంభప్రార్థన:

ఓ త్రియేక దేవుడవైన తండ్రీ! సాతానును ఎదిరించవలెనని నీ వాక్య గ్రంథములో వ్రాయించినావు. ఇదిగో ఇప్పుడే నీ సన్నిధానమందు వాటిని ఎదిరించుచున్నాము. మా ఎదిరింపుల వలన సైతానుకు వేదన, నిస్సత్తువ కలిగించుము. మా ఎదిరింపుల వలన నీకు మహిమ, సంఘమునకు జయము కలిగించుము.

దయగల తండ్రీ! సర్వశక్తిగల తండ్రీ! మేము సాతానును ఎదిరించుటకు నీ సర్వశక్తిలో నుండి మాకు శక్తిని దయచేయుము. శత్రువు బలమంతటిమీద మీకు అధికారమిచ్చియున్నానని లూకా 10వ అధ్యాయములో వ్రాయించినావు. కాబట్టి మా తండ్రీ! ఆ అధికారమును మేము వాడుకొనే కృప దయచేయుమని ప్రభువు నామములో వేడుకొనుచున్నాము. సర్వలోకమును సృష్టించిన సృష్టికర్తయైన తండ్రియొక్క నామములో, సర్వలోకమును రక్షించిన రక్షణకర్త యైన యేసుప్రభువు యొక్క నామములో, సర్వలోకమును ఆదరించుచు, ఆయత్త పరచుచున్న పరిశుద్ధాత్మ తండ్రియొక్క నామములో, త్రియేక దేవుని నామములో, గాలి లోకములో బంధకములోయున్న ఓ *సాతానా! సాతాను అనుచరులారా! దురాత్మలారా! దురాత్మల సమూహములారా! దయ్యములారా! భూతములారా! పిశాచములారా!* మేము మిమ్ములను ఎదిరించుచు, గద్దించు చున్నాము గనుక మా ఎదిరింపులు, గద్దింపులు జాగ్రత్తగా ఆలకించుమని త్రియేక దేవుని నామములో మీకు ఆజ్ఞాపించుచున్నాము.

## 1. సాతాను నెదిరించు ప్రార్థనలు

1) ఓ యేసుప్రభువా! నీవు అరణ్యములో సైతానుతో, 'సాతానా! పొమ్మని' చెప్పినావు (మత్తయి 4:10). వాడు ఒక్క నిమిషమైన ఉన్నాడా! ఏలాగు ఉంటాడు? ఆ వాక్యము ఈ వేళ మేము వాడుకొనేటట్లు నీ కృప దయచేయుము. నీవు వాడిన ఆ మాటలు, మేము వాడినా సాతానుకు ఎక్కువ భయము. మా ప్రార్థన ఆలకించుమని వేడుకొనుచున్నాము.

2) ఓ దేవా! మేము రక్షింపబడినాము, సాతాను రక్షింపబడలేదు. రక్షింపబడిన వారికి ఎక్కువ బలమా? రక్షింపబడని వారికి ఎక్కువ బలమా? గనుక వాడి మాటలు బలము లేనివని, మేము ఎదిరించుటకు మాకు సాహసము దయచేయుము.

3) ఓ ప్రభువా! సైతాను చీకటి వ్యక్తి. తాను చీకటి వ్యక్తి కాదని భక్తులు భ్రమపడునట్లు, వెలుగు దూత వేషము ధరించుకొనును. అందువలన అతడు వేషధారి. ఈ మాటలు మేము సైతానుకు చెప్పి వానిని ఎదిరింతుము. మాకు సహాయము దయచేయుము.

4) యేసు ప్రభువా! సైతాను మమ్ములను గురించి చెడ్డ తలంపులు తలంచినపుడు, వాడు కెవ్వుమని కేకవేయునట్లు అతని నిరాకార తలంపులపై, బాణము వేయుము. వాడు మాపై మిర్రుమని చూచునప్పుడు, అతని కండ్లలోనికి బాణము వేయుము. మమ్ములను గూర్చి అతని దూతలు చెడ్డ రిపోర్టులు వినిపించేటప్పుడు, వాడు ఆలకించుచుండగా, వాని నిరాకారపు చెవులలోనికి బాణము వేయుము. అతడు నీ యొద్ద మమ్ములను గూర్చి చాడీలు చెప్పునప్పుడు, వాని నిరాకారపు నోటిలోనికి బాణము వేయుము. తిండి వలనగాని, తిను బండారముల వలన గాని మాకు జబ్బు చేయునప్పుడు, వాని నిరాకారపు ఉదరములోనికి బాణము వేయుము. వాని చేతులతో మాకు హాని చేయునప్పుడు, వాని నిరాకారపు చేతులలో బాణములు గ్రుచ్చుము. వాడు మా కాళ్ళకు హాని చేయునప్పుడు, వాని నిరాకారపు కాళ్ళ లోనికి బాణములు గ్రుచ్చుము. వాడు మా జీవితకాలములో ఏ హానిచేసినను, మాకు కలిగిన దేనికైనను హాని చేయునప్పుడును వాని నిరాకారపు చోటుపై బాణము గ్రుచ్చుము.

వాడు మాలో కలిగించు కోపము, అసూయ, సోమరితనము, ఆందోళన, మందస్థితి, నిష్ఫలస్థితి, అపజయము, నిరాశ, అపనమ్మిక, భక్తిహీనత, దిగులు, అధైర్యము, దీర్ఘకాలచింత, దుఃఖము, అశ్రద్ధ, చెడు కోరికలు, అపార్థములు, మనస్పర్థలు, కలహగుణము, అందని వాటిని ఆశించుట, వృద్ధాప్యమువల్ల కలుగు హాని, నిస్సహాయత్వము: ఇవి రానీయకుము. అతడు మా ప్రార్థనను బట్టి చెలరేగిన యెడల, అతనికే హాని రానిమ్ము గాని మాకు హాని రానీయకుము.

5) ఓ సృష్టికర్తవైన తండ్రీ! టోబియా, సన్బల్లటుల మాటలు తుదకు నెరవేరలేదు గదా! ఎజ్రా, నెహెమ్యాల యొక్క మాటలు నెరవేరినవి గదా! నీవు మా దగ్గర ఉన్నావు గనుక సాతాను మాటలు ఎలాగు నెరవేరును? ఇంతవరకు అతని పంతము నెరవేరలేదు గదా! అలాగే చివర వరకు నెరవేరదు. నెరవేరకుండ చేయువాడవు నీవే. సైతాను మాటలన్నియు బెదిరింపు మాటలే గాని నిజమైన పలుకులు కావని వాడును, భూతములును గ్రహించునట్లు చేయుము.

6) ఓ తండ్రీ! మేము ఒక్క భూతమును ఎదిరించునప్పుడు, వాడి సైన్యమంతటిని ఎదిరించినట్లే. మా ఎదిరింపులు వాడి సైన్యమంతటికిని చెందును. అతని సైన్యమంతటిని ఎదిరించి గెల్చుటకు నీ సైన్యమును, పరలోకపు దూతలను, భక్తులను, విశ్వాసులను మాకు సహాయముగా దయచేయుము. నీవే మా పక్షముగా సైతానుతో యుద్ధము చేయుమని వేడుకొనుచున్నాము.

7) యేసు ప్రభువా! నీవు సిలువమీద ఉన్నప్పుడు, దుష్టులు- 'నీవు ఇతరులను రక్షించినావు. నిన్ను నీవు రక్షించుకోలేవా' అని హేళన చేసినారు. అయితే ప్రభువా! నిన్ను నీవు రక్షించుకొంటే, లోకమంతటిని రక్షించుకొనలేవు. అందుచేత ఆ హేళన అబద్ధముతో కూడుకొని యున్నది. సైతాను నీ పనికి అడ్డము వచ్చి, ఏదో ఒక మాట అని వెళ్ళిపోవును గాని ఆ మాటలో నిజము ఉండదు, గనుక మాకు ధైర్యము దయచేయుము. 'ఓ సాతానా! నిన్ను నీవు రక్షించుకొనలేవు, ఎవరిని రక్షింపలేవు. దుష్టుల చేత మా ప్రభువును అనిపించిన మాట ఎందుకు నీకు?' అని మేము సాతానును ఎదిరించేటట్లు మాకు బలము అనుగ్రహించుము.

8) ఓ దేవా! సైతాను ఇట్లనుకొనుచున్నాడు. 1) 'నేను విశ్వాసులకు కూడ జబ్బులు, కష్టములు పంపించుచున్నాను గనుక నాదే జయము, నా రాజ్యమునకే వృద్ధి'. అయితే మేము 'సైతానా! నీ రాజ్యమునకు, నీ జయమునకు లయము, నాశనమని' ప్రకటించుచున్నాము. 2) మరియు సాతాను ఇట్లనుకొను చున్నాడు. 'విశ్వాసులు ఎంత ప్రార్థన చేసినను, వారి కష్టములు నేను పోనీయలేదు గనుక నాదే జయము, నా రాజ్యమునకే వృద్ధి. విశ్వాసుల డాబుసరి మాటలు ఏవి?' మేమైతే, 'సైతానా! *నీకెన్నడు జయమురాదు. గడియ* వచ్చినపుడు మా కష్టములు

తీరిపోవును, మా ప్రార్థనలు నెరవేరును. మాకే జయము. నీవు అపజయపరుడవని' ప్రకటించుచున్నాము. 3) ఇంకను సైతాను– 'నేను కష్ట నివారణకు ఆటంకముగా నున్నప్పుడు, నీ తండ్రి వచ్చి కష్టనివారణ చేసినాడా! లేదు. గనుక నా రాజ్యము వృద్ధి పొందుచుండగా, దేవుని రాజ్యము వృద్ధి పొందుటలేదు కదా!' అనుచున్నది. అయితే మేము, 'ఓ సాతానా! నీకు, నీ పనులకు లయము, నాశనము' అని ప్రకటించుచున్నాము.

ఉదా: వరద రోజున గోదావరి గట్టుమీద నున్న చిన్న కుర్రవానికి సుడిగుండము కనబడుచున్నది. పైనుండి వచ్చుచున్న నీళ్ళు ఆ సుడి గుండములోనే ఆగిపోవుచున్నవని అనుకొనుచుండెను. ఇంతలో ఒక పెద్ద విద్యార్థి ఆ కుర్రవానిని చూచి, నీవు మొదట చూచిన నీరు, ఆనకట్ట మీదికి వెళ్ళిపోయినదని చెప్పెను. అలాగే పైకి కనబడకపోయినను, దేవుని రాజ్యము వృద్ధి పొందుచునే ఉన్నది. ఓ యేసు ప్రభువా! ఈ సత్యములను అందరికిని బయలు పరచుము. నమ్మునట్లు విశ్వాసము దయచేయుము. సైతానును సాహసముతో ఎదిరించునట్లు శక్తి దయచేయుము.

9) యేసు ప్రభువా! నీవు మత్తయి 18:18లో సెలవిచ్చినావు గదా! 'భూమి మీద మీరు వేటిని బంధింతురో, పరలోకములో నేను వాటిని బంధింతునని' అన్నావు. *గనుక ఇప్పుడే మేము సాతానును, వాని దూతలను బంధించుచున్నాము. నీవును వాటిని బంధించుము.* ఓ భూతములారా! మా పరలోకపు తండ్రియొక్క స్వాతంత్ర్యమును బట్టి, మిమ్ములను ఇప్పుడే బంధించు చున్నాము. మీరు ఏలాగు తప్పించుకొందురో చూచెదము! సాతానా! నీకు బంధన కలుగలేదని నీవు అబద్ధమాడుచున్నావు. నీకు సత్యము చెప్పుటరాదు.

10) 'భూమిమీద మీరు వేటిని విప్పుదురో, అవి పరలోకమందును విప్పబడునని' అన్నావు (మత్తయి 18:18). సైతాను భూలోకములో అనేక మంది భక్తులను కట్టివేసినాడు. యేసుప్రభువా! పరలోకములో ఆ బంధకములను విప్పుము.

*షరా: మన దృష్టిలో ఎవరైనా బంధింపబడిన వారున్న యెడల వారిని తలంచుకొని, ఈ పైన వ్రాసిన విధమున ప్రార్థింపవలెను.*

11) ఓ దేవా! అంతములేని కృపగల దేవా! నీకు స్తోత్రములు. సైతాను తనకు ఎక్కువ సమయము లేదని చెలరేగి, విశ్వాసుల మీద పడుచున్నాడు.

అతని ఆలోచనలు సాగనీయకుము. అతని ప్రయత్నములు నెరవేరనీయకుము. అతని పన్నాగములను చెడగొట్టుము. యూఫ్రటీసు నదివద్ద ఉన్న నాలుగు భూతములను నీవు బంధించినావు. ఆలాగుననే ఇప్పుడును, లోకమంతట తిరిగే భూతములను, వాటియొక్క పనులను నీవు బంధించుము. ఆమేన్.

## 2. సైతాను నెదిరించు దైవ స్తుతులు - స్తుతి దీపము

1) దయగల తండ్రీ! సర్వశక్తిగల తండ్రీ! మేము సైతానును ఎదిరించుటకు, నీ సర్వశక్తిలో నుండి మాకు శక్తి దయచేయుము. 'శత్రువు బలమంతటి మీదను మీకు అధికారమును అనుగ్రహించియున్నాను' అని లూకా 10:19లో వ్రాయించినావు. కాబట్టి ఆ అధికారమును మేము వాడుకొనే కృప దయచేయుము. ఓ భూతములారా! భూలోకములోను, మనుష్యులలోను, జీవరాసులలోను మాకు శత్రువులున్నట్లు తెలుసును. ఆ శత్రువులకంటె మీరే మాకు గొప్ప శత్రువులైనను, మీ బలమంతటి మీదను ప్రభువు మాకు అధికారము ఇచ్చియున్నాడు. కాబట్టి మిమ్మును ఏమైనా చేయుదుము. మేము ఏమన్నా చెల్లుతుందని చెప్పేటట్లు, ఓ ప్రభువా! మాకు సహాయము దయచేయుము. ఈ ప్రార్థన విన్నందుకు నీకు మా స్తోత్రములు.

2) ఓ భూతమా! నీవు స్త్రీవి కావు, స్త్రీలందరికంటె తక్కువైన భూతానివే. నీవు పురుషుడవు కావు, గనుక నీవు పురుషులందరి కంటె తక్కువే. నీవు పక్షివి కావు, పక్షులన్నిటి కంటె తక్కువే. నీవు జంతువు కాదు, జంతుజాలము కంటె తక్కువే. మా తండ్రి పురుగులను కలుగజేసెనని, ఆదికాండము మొదటి అధ్యాయములో వ్రాయబడి యున్నది. అట్టి పురుగులలో నీవు ఒక పురుగువు కూడ కాదు, గనుక నీవు పురుగు కంటె తక్కువే. మా తండ్రి మా ఉపయోగము కొరకు, కదలనటువంటి చెట్లను, కొండలను, భూమిని కలుగజేసినాడు. నీవు వాటిలో ఒక దానికైనను సమానము కాదు గనుక వాటి కంటె నీవు తక్కువే. మా తండ్రి ఏది కలుగజేసెనో, ఆ ప్రతి దానికంటె నీవే తక్కువ. తక్కువైన వాటిని, మా కాళ్ళతో మేము త్రొక్కివేయగలము. అలాగే నిన్ను మా పాదముల క్రింద వేసి త్రొక్కివేయగలము. ఈ మాటలు మా తండ్రి, బైబిలులో మాకు వ్రాయించి ఇచ్చినారు. గనుక ఇదిగో చూడు, నిన్ను మా పాదముల క్రిందవేసి, దేవుని

నామమున త్రొక్కుచున్నామని సైతానుతో చెప్పగల ధైర్యము, ప్రభువా! మాకు దయచేయుము. ఈ మనవి విన్నందులకు నీకు స్తుతులు.

3) *ఓ భూతమా! మేము రోజుకు 24 గంటలు పాపములో పడిపోయినను,* మమ్ములను లేవనెత్తి రక్షించే రక్షకుడు మాకున్నాడు. నీవు ఒక్క నిమిషము పాపములో పడితే, నిన్ను రక్షించే రక్షకుడు నీకు లేనే లేడు. గనుక నీవు సంతోషముతో గంతులు వేయనక్కరలేదు. నీ గంతులు, నీ తంతులు మాకు తెలిసే యున్నవి. మేము నీకు భయపడమని సాతానును ఎదిరించేటట్లు, మాకు స్వాభావికమైన బుద్ధిని దయచేయుము. ప్రభువా! మా ప్రార్థనలు ఆలకించినావని నీకు ప్రణుతులు చెల్లించుచున్నాము.

4) ఓ భూతమా! నీవు ఒకప్పుడు దేవదూతల సమాజములో ఉండి క్రింద పడితివి. మేము దేవదూతల సమాజములో నుండి పడలేదు, భూమి మీద మనుష్యుల సమాజములో నుండి పడితిమి. కాబట్టి మేము లేవగలము. ప్రభువు లేవనెత్తుట వేరు, మా అంతట మేము లేచుట వేరు. ఈ రెండును మాకున్నవి. వాటిలో ఒకటి కూడ నీకు లేదు. పాపము చేయవలెనని తలంపు, పాపనైజము, మేము తెచ్చుకొన్నవి కావు. అవి నీవు తెచ్చి అంటించినవి. కాని మేము తెచ్చుకొన్నవి కావు. ఎప్పటికైనను వీటిని నీవు తీసికొని పోవలెను. మాకెందుకు? యేసు ప్రభువు *మా పాపములను తన మీద వేసికొనుట, మాకు లేకుండా చేయుటకే. సైతానుమీద వేయుట, అతని మీద ఉండుటకే.* దేవా! ఈ మాటలు మేము సైతానుకు చెప్పే ధైర్యము మాకు దయచేస్తావని నమ్ముచున్నాము. నీకు వందనములు.

5) ఓ భూతమా! నీవు మమ్ములను ఎంత గొప్ప పాపులనుగా మార్చి నప్పటికిని, భూతమనే పేరు మాకు రాదు. మనిషి అనే పేరు మాకుంటుంది. అది ఎప్పుడైన గుర్తించినావా? నీవు ఎన్ని సంవత్సరములు నోరునెత్తి బాదుకొన్నా, దేవదూత అనే పేరు నీకు తిరిగి రానే రాదు. అయితే మేము ఎంత మనుష్యుల మైనను, పాపులమైనను దేవదూతలనే పేరు మాకు వస్తుందని సువార్తలలో మా ప్రభువు వ్రాయించినాడు (మత్తయి. 22:30; లూకా. 20:36). నీకు ఎప్పటికైనా దేవదూత అనే పేరు రాదు కదా! రాదు గనుక మేమే ఎక్కువ. ప్రభువా! ఈ మాటలు మేము సైతానుకు చెప్పేటట్లు నీవు చేయుచున్నావు. గనుక నీకు స్తుతులు.

6) ఓ భూతమా! 'సైతానా, నా వెనుకకు పొమ్మని,' నిన్ను మా రక్షకుడు అన్నాడు (మత్తయి 16:23). పేతురులో చెడ్డ తలంపు పుట్టించిన సైతానును అన్నాడు. 'ఓ పేతురూ' అని అనలేదు, 'సైతానా' అని అన్నాడు. ఈ రెండింటికిని భేదమున్నదా! లేదా? కొండపై ప్రభువును శోధించుట (మత్తయి 4వ అధ్యాయము), వెలుపల నుండి శోధించుట. ఇక్కడ పేతురులో తలంపు పుట్టించినావు. అందుకు 'సాతానా!' అని అన్నాడు. ప్రభువా! మేము ఈ సమాధానము సైతానుకు చెప్పేటట్లు చేసినావు గనుక నీకు అనేక మనఃపూర్వకమైన వందనములు.

7) ఓ భూతమా! నీ గుండెలో నరులు నాశనమగుదురు గాక! అని ఉన్నది. ప్రభువా! రక్షించుమని మనిషియొక్క మనస్సులో నున్నది. ఎంత పాపినైనను రక్షించవలయునని దేవుని హృదయములో నున్నది. ఎటువంటి దయ్యమునైనను రక్షించెదనని లేదు, కొంచెమైనను లేదు. దేవా! ఈ మాటలు మేము సాతానుకు వినిపించేటట్లు చేసినావు గనుక నీకు సంస్తుతులు.

8) లోకములో నున్న పాపాత్ములలో, సైతానుకంటె హెచ్చయిన పాపాత్ముడు ఒక్కడును లేడు. ఒక్కడు ఉన్నయెడల అతనిలో కూడ రక్షణాపేక్ష స్వరము, తల వెంట్రుకంతైనను ఉండక మానదు. ఓ భూతమా! నీకు ఆ తలంపు లేదు, అంత తలంపు లేదు, ఎంత తలంపు లేదు. ఉంటే రక్షణ వచ్చును. రక్షింపబడని మనుష్యాత్మ హేడెస్సులో ఉండవచ్చును. నీవు అతిశయించనక్కరలేదు. దేవా! ఇట్లు సైతాను ముఖము ఎదుట చెప్పే శక్తి, నాలో ఉంచినావు గనుక నీకు అనేక కోటానుకోట్ల మంగళ స్తుతులు. మా స్తుతులు, స్తోత్రములు యేసు నామమున చేయుచున్నాము. ఆమెన్.

## 3. సైతానును ఎదిరించుట

1) ఓ సైతానా! మానవులకు నిన్ను ఎదిరించు సూత్రములు తెలియక, నీకు భయపడుచున్నారు. అందుచేత నీవు శోధించేటప్పుడు పాపములో పడిపోవు చున్నారు. తల చితికిపోయిన సర్పము యొక్క తోక కదలుచుండుట చూచి, చిన్న పిల్లలు భయపడుదురు గాని పెద్దవారు భయపడరు. అలాగుననే విశ్వాసులు నీ క్రియలు చూచి భయపడరు. నీలో బలములేదని తెలుసును. నిన్ను మా

ప్రభువు *జయించినాడు గదా!* ఆ జయము మా పక్షముగా నున్న జయము గనుక నిన్ను జయించినట్లే.

2) ఓ సాతానా! 'అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీయొద్ద నుండి పారిపోవును' (యాకోబు 4:7) అని వాక్యము చెప్పుచున్నది. ఆ వాక్య వాగ్దానమే నాకాధారము. అయితే ఇదివరకు నేనాలాగు చేయలేదు, గనుక నీవు నన్ను లోకువగట్టి మాట్లాడినావు. నేను బెదిరినాను గనుక నాకు సరియైన దర్శనము రాలేదు. బెదరకపోతే మహిమగల దర్శనాలే వచ్చియుండును. దర్శనములు రాకపోవుటకు నీవు కాదు కారణము, నా బెదరే కారణము. నేను గొప్ప పని చేస్తున్నానని నీవు అనుకొనుచున్నావు.

3) ఓ సైతానా! మిఖాయేలు దేవదూత నీతో, మోషే శరీరమును గురించి వాదించినప్పుడు, నిన్ను గద్దించుటకు, దూషించుటకు ప్రయత్నించలేదు గాని '*యెహోవా నిన్ను గద్దించును గాక!*' అని చెప్పెను (యూదా 9వ వచనము). ప్రభువు మిఖాయేలుకు ఒక్కమాటే ఇచ్చినాడు గనుక ఆ ఒక్కమాటతోనే నిన్ను ఎదిరించినాడు. అయితే బైబిలులో అనేకమైన మాటలు ప్రభువు మాకు ఇచ్చియున్నారు గనుక ఆ మాటలతో నిన్ను గద్దిస్తాము గనుక విను.

4) ఓ సైతానా! నిన్ను ఎదిరించవలెనని వాక్యములో నున్నది గనుక నిన్ను ఎదిరించుటకు మాకు దైవాధికారము కలదు. మరియు శీఘ్రముగా నిన్ను మా పాదముల క్రింద (ప్రభువు) చితుక త్రొక్కించును (రోమా 16:20) అని వ్రాయబడి యున్నది. కాబట్టి నిన్ను ఎదిరించుటకు, త్రొక్కుటకు మాకు సర్వాధికారమున్నది. నీవు త్రియేక దేవుని ఎదిరించినావు, అందుచేత మేము నిన్ను ఎదిరిస్తున్నాము. మరియు నీవు మా ప్రభువును, సిలువ మ్రానుమీద అంటగొట్టించినావు. మేము నిన్ను మా కాళ్ళ క్రిందవేసి త్రొక్కుటవలన, నీ శిరస్సును, నీ ముఖమును, నీ చేతులను, నీ కాళ్ళను, నీ ప్రక్కను త్రొక్కి వేస్తున్నాము. ఇట్టి పని నీవు మా ప్రభువునకు, సిలువ మ్రాను మీద చేయలేదా? ఇప్పుడు మేము నీకు చేస్తున్నాము. సర్పమును చంపువారు ఎక్కడైనను కొట్టి సంతుష్టి పడరు. తల చితుక గొడితేనే గాని వదలిపెట్టరు. అలాగే మేము నిన్ను చితుకగొట్టక మానము. అనగా నీవు నీ తలలో ఆలోచిస్తున్న ఆలోచనలన్ని చితుకగొట్టి, నీ ప్రయత్నములు సాగనీయకుండ చేయుదుము.

5) ఓ సైతానా! 'ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి, ఆయనయందు బలవంతులై యుండుడి' (ఎఫెసీ 6:10) అని వ్రాయబడి యున్నది. గనుక మేము నిన్ను గద్దించినా, చివాట్లు పెట్టినా, నీ ప్రయత్నములు చిన్నాభిన్నము చేసినా, మా ప్రభువు యొక్క బలమును బట్టి చేస్తాము. మా కోరిక నెరవేరుతుంది, నీ కోరిక శూన్యమౌతుంది.

6) ఓ సైతానా! నీవు మా ప్రభువును చూచి, 'నీవు పరిశుద్ధుడవు' అని అన్నావు (లూకా 4:34). అప్పుడాయన ఏమన్నాడు? 'ఊరుకో' మన్నాడు, అలాగే నీవేదైనా అన్నా, మంచిమాట అన్నా, చెడ్డమాట అన్నా, మేము కూడ 'నోరుముయ్!' అంటాము. మాకు అట్టి అధికారము గలదు. యేసుప్రభువు పరిశుద్ధుడే, నీవన్న మాట ఆయనకు తగినదే కాని ఆయన ఒప్పుకోలేదు. అలాగే నీవు మా మనస్సులో ఏదైనా ఒక మంచి మాట అంటే, మేము కూడ ఒప్పుకొనము. అప్పుడు నీవు సిగ్గుపడవలెను.

7) ఓ సాతానా! మా ప్రభువు నిన్ను చూచి, 'సాతానా! నా వెనుకకు పొమ్మని' కసిరినాడు (మత్తయి 16:23). వెంటనే పారిపోయినావు, వెనుకకు చూడకుండ పారిపోయినావు. నీవు మా తలంపులలో, మా స్వప్నములలో, మా దర్శనములలో మాకు కనబడితే, మా ప్రభువు అన్నమాటే మేముకూడ అనగలము. అప్పుడు నీవు వెళ్ళిపోవలసినదే. నీవు మా ప్రభువు యొక్క సెలవుమీద వచ్చినప్పటికిని, మా సెలవు మీద పారిపోవలసినదే.

8) ఓ సాతానా! 'దుష్టుడు ఎవడును తరుమకుండానే పారిపోవునని, (సామెతలు 28:1)లో వ్రాయబడియున్నది. మానవులలోనున్న దుష్టునికంటె నీవు ఎక్కువ దుష్టుడవు. మానవుని దుష్టునిగా మార్చిన దుష్టుడవు. కాబట్టి నీవు మరింత వేగముగా పారిపోవలెను. ఎప్పుడనగా మేము ఇటువంటి సమావేశములు, ప్రభువు సేవ, బైబిలు పఠన చేసి– 'సాతానా! మా సమావేశములకు ఎందుకు వచ్చావని' చెప్పి, నిన్ను వెళ్ళిపొమ్మని అనకపోయినప్పటికిని, నీవు వెళ్లిపోవలయును. మా పరిశుద్ధ ఆచారములను చూచి, నీవు సహించలేవు గనుక పారిపోవలెను. అట్లే నీ దుష్టత్వమును చూచి, ఎవరైనా దేవదూతలు వచ్చి తోలివేస్తారేమోనని ముందే పారిపోవుదువు. గనుక మాకు జయము, నీకు అపజయము మరియు అవమానము.

9) ఓ సైతానా! మా ప్రభువు నీకు 'సైతానని' పేరు పెట్టినాడు. ఆ పేరునకు నీవు తగినవాడవు. అనగా నీ పేరునకు 'తీర్పు పొందదగినవాడవనే' అర్థమున్నది (మత్తయి 4:10). గనుక సాతానా! నీ పేరునకును, 'పొమ్మ' అను ఆజ్ఞకును సంబంధము ఉన్నది. కాబట్టి నీవు పోయేవాడవే కాని ఉండేవాడవు కావు. ఆ మాట నీకు తగియున్నది. ఆ మాట మేముకూడ వాడవచ్చును. ఆ మాట మా ప్రభువు అన్నప్పుడు నీవు ఎలాగైతే వెళ్ళిపోయినావో, అలాగే మేము ఆ మాట అన్నప్పుడు కూడ నీవు వెళ్ళిపోవాలి. ఓ సైతానా! నీవు ఎటువంటివాడవో ఆ సంగతి మాకు తెలియకుండ మారువేషముతో వస్తావని, బైబిలు గ్రంథములోని కథల వలన తెలిసికొన్నాము. నీవు ఆత్మస్వరూపివైనప్పటికిని, సర్పరూపముతో మా ఆదితల్లి దగ్గరకు వచ్చినావు గదా! నీ వెంత మారువేషములో వస్తే మాత్రము మాకు తెలియదేమిటి! దైవ వాక్యమువల్ల నీ నిజస్థితి ఎట్లు తెలియునో, అట్లే మా ప్రభువు వల్ల కూడ తెలియును, మా అనుభవమువల్ల కూడ తెలియును, మా జ్ఞానమువల్ల కూడ తెలుస్తుంది. కాబట్టి నీవు మరుగైయుండలేవు. *దొంగ, దొంగయని యజమానునికి తెలియగానే వాడు పారిపోవునట్లు, నీవును పారిపోవుదువు.*

10) ఓ సాతానా! మా ప్రభువు భూమిమీద నున్నప్పుడు, ఆయన ముఖ్యమైన పనులలో ఒక పని, దయ్యములను వెళ్ళగొట్టుటయే. ఆ పనే మాకు కూడ అప్పగించినాడు (మార్కు 16:17). గనుక వెళ్ళగొట్టుట మా పని, పారిపోవుట నీ పని.

11) ఓ సాతానా! నీవు 'మా మీదికి దండెత్తుదునని' అంటున్నావు. ఈ సంగతి మాకు తెలియదా! మేము ప్రార్థించగానే దండెత్తుదువని మాకు తెలిసినదే. నీవు అనడము వలన నీ తెలివి తక్కువతనము కనబడుచున్నది.

12) ఓ సాతానా! మొదటి శతాబ్దములోనే లోకమంతటిని గురించి యేసుప్రభువు యొక్క శిష్యులు, భక్తులు ప్రార్థించలేదా! అప్పుడు నీవు ఎక్కడికి వెళ్ళినావు? మేము ఇప్పుడు ప్రార్థించుచుండగా, మమ్ములను అడగడానికి నీవెవ్వడవు? నీవు దయ్యానివి గాన నీ బుద్ధి కనబరచుచున్నావు.

13) ఓ సాతానా! డాక్టర్ మార్టిన్ లూథర్గారు వ్రాసిన చిన్న ప్రశ్నోత్తరి, నీవు ఎప్పుడైనా చదివినావా? అందులో మూడవ మనవియొక్క అర్థములో

శరీరము, లోకము, సైతాను మొదలగునవి, దేవుని చిత్తము జరుగకుండ ఆటంక పరచునవి గనుక వాటిని ఎదిరించవలెనని ఉన్నది.

14) ఓ సాతానా! నీవు మా కూటస్థులను విడదీస్తానంటున్నావు. ఆలాగున విడదీస్తే, మేము అనేక చోట్లకు పోయి, సన్నిధి కూటములు పెట్టుదుము. అప్పుడు నీకింకా కష్టము, నష్టము జాగ్రత్త.

15) ఓ సాతానా! పాములవాడు బూర ఊదగా, పాము బయటకు వచ్చును. పాము ఎందుకు బయటకు వచ్చును? చావునకు వచ్చును! అలాగే మా ప్రార్థనలు అన్నీ విని, కోపముతో నీవు బయటకు వస్తున్నావు. గనుక నీ అంతము దగ్గరకు వచ్చినది. అది నీకు తెలియడము లేదు.

16) ఓ సైతానా! నీవు ఆడ మనిషివి కావు, మగ మనిషివి కావు. గనుక నిన్ను ఒకసారి ఆడ మనిషిగాను, మరియొకసారి మగవానిగాను చేసి మాట్లాడుదుము. నిన్ను అంత నీచముగా చూస్తున్నాము, అయినను నీకు సిగ్గులేదు.

17) ఓ సాతానా! నీవు మా స్వంత అవయవముల మీద బాణములు వేసినావు. నీవు ఆకారము లేనివాడవు, అయినను నీకు మా వంటి అవయవములు నిరాకారముగా నున్నవని గ్రహించి, నీ నిరాకార అవయవముల మీద మేము బాణములు వేయుచున్నాము.

18) ఓ సాతానా! నీ దూతలు నిన్ను చూచి, 'నీవల్ల మేము కూడ చెడిపోయినాము' అని వారు నిన్ను ఎదిరిస్తారేమో! అప్పుడునీకు మరింత బాధ. అందుకు నీవు, *'నేను శోధిస్తే మాత్రము మీరెందుకు పడవలెను?'* అంటే అప్పుడు వారికి బాధ. కాబట్టి నీకు, నీ దూతలకు బాధపడే యోగము పట్టును.

19) ఓ దయ్యములారా! మీరు విశ్వాసుల మీద బాణములు వేయునప్పుడు, వారు కూడ మీ మీద బాణములు వేయుదురు. కాబట్టి మీకు ఎల్లప్పుడు తెరిపిలేని బాణములు. మీరు తప్పించుకొనలేరు.

20) ఓ సైతానా! ఆదాము మొదలుకొని లోకాంతము వరకు, భూమి మీద ప్రవేశించిన పాపములతోపాటు, వాటి ఫలితములు ఇదివరకే నీ ముఖము మీదికి విసరి వేసినాము. అయితే ఇప్పుడు నీ మీదకు, నీ దూతల మీదకు అసహ్యమైనవి, హానికరమైనవన్నియు విసరి వేయుచున్నాము. అవేవనగా బంద,

చెత్త, జంతువుల యొక్కయు, పక్షుల యొక్కయు, జీవరాసుల యొక్కయు, పురుగుల యొక్కయు మలినము నీ ముఖమున వేయుచున్నాము. ముండ్లు, తుపాకి గుండ్లు, కత్తులు, బళ్ళెములు, ఈటెలు, కొట్టేకఱ్ఱలు, కొట్టేరాళ్ళు, నీ మీదికి విసరి వేయుచున్నాము. జీవరాసుల యొక్క శవములుకూడ నీ మీదికి విసరి వేయుచున్నాము. నీవు చెలరేగుచున్నావు గనుక మేముకూడ చెలరేగు చున్నాము. **నీవు ఇప్పుడైనా మారుమనస్సు పొందుము.** తలకు సంబంధించిన పిచ్చితనము మొదలగు వ్యాధులు, చెవికి సంబంధించిన వ్యాధులు, కండ్లకు సంబంధించిన వ్యాధులు, నోటికి సంబంధించిన వ్యాధులు, ఊపిరికి సంబంధించిన వ్యాధులు, కాళ్ళకు సంబంధించిన వ్యాధులు, ఉదరమునకు సంబంధించిన వ్యాధులు, చేతులకు సంబంధించిన వ్యాధులు, చర్మమునకు సంబంధించిన వ్యాధులు, రక్తమునకు సంబంధించిన వ్యాధులు, నాసికకు సంబంధించిన వ్యాధులు, శరీరములో ప్రతి భాగమునకు సంబంధించిన వ్యాధులు, మనసునకు కలిగే గందర గోళములు, అపనమ్మిక, భీతి, విసుగుదల, సణుగు, సందేహము, కోపము, అసూయ, దిగులు మొదలగునవన్నియు ఓ సాతానా! నీ మీదికే విసరి వేయుచున్నాము.

21) ఓ సాతానా! ఆది సర్పము, ఘట సర్పము, సైతాను, అపవాది, శోధకుడు మొదలగు నీ పేరులలో ఏదీ మంచి అర్థము లేదు, చెడుగే ఉన్నది. గనుక నీవు సంతోషించవలసిన పని లేదు. నీ పేరు చెడుగే, నీ అపజయము చెడుగే, నీదంతయు అన్నియు చెడుగే. కాబట్టి మా మీద అధికారము చేయలేవు. మాలో చెడుగున్నను అది నీవు అంటించిన చెడుగే కాని, నీవలె తెచ్చిపెట్టు కొనుటకు, మేము సృజించిన చెడుగు కాదు. ఓ భూతమా! నీవు అతిశయింప పనిలేదు.

22) ఓ సైతానా! మనుష్యులలో కొందరు నీ మాటలకు లోబడి, నీ వలె దయ్యములుగా మారి, మనుష్యులలో ప్రవేశించి కీడు చేయుచున్నారు. ఇవి కూడ నీ దుష్టక్రియలే.

23) ఓ సాతానా! నీకు నిజము చెప్పడము ఎప్పుడైనా తెలుసునా? తెలియదు. అబద్ధము చెప్పుట మాత్రము సులువుగా తెలుసును, గనుక జాగ్రత్త.

24) దుష్టుడవైన ఓ సాతానా! 'నేను ఆత్మస్వరూపిని, బలము గలవాడనని' అనుకొని విర్రవీగుచున్నావు. నీ దృష్టికి మానవులమైన మేము, బలహీనులుగా కనిపించుచున్నామా? అయితే, 'బలమైన సర్పము 'చలి చీమల చేత చిక్కి, చచ్చెను గదరా' అను పద్యము నీకు బాగుగా వర్తించును. ఒకవేళ మేము ఆత్మీయ జీవనములో బలహీనులముగా నున్నప్పటికిని, మేము చేసే ప్రార్థనలు నీకు ములుకులై, నిన్ను బంధించి, తుత్తునియలుగా నలగగొట్టునని గుర్తుంచుకొనుము. అప్పుడైనా నీకు బుద్ధి వస్తుందేమో!

25) ఓ సైతానా! మేము నిన్ను ఎదిరించేటప్పుడు నీ సైన్యమంతటిని ఎదిరించినట్లే. మా ఎదిరింపులు నీకు, నీ సైన్యమంతటికిని చెందును.

## 1. పిశాచి

26) ఓ పిశాచీ! మా బైబిలు గ్రంథములో నీ పేరు ఎక్కడ ఉదహరించినను, నీ చేతలు ఎక్కడ ఉదహరించినను, చెడుగే గాని మంచి లేనే లేదు. నీ చరిత్ర మొదటి పర్యాయమున్న ఆదికాండము మొదలుకొని, ప్రకటన గ్రంథము వరకు నీవు కళ్ళు విప్పిచూస్తే, ఒక్కొక్క చరిత్రకుని యొద్దకు వెళ్ళడము, సిగ్గుపడి మళ్ళడము ఉంటుంది. నీవు సిగ్గుపడని క్రియ ఏదైనా, ఒకటయినా, గ్రంథములో నున్నదా? లేదు.

27) చీమ కుట్టెను, పిశాచీ ఇది నీ పని. ఒకరు నాలుగు సంగతులు చెప్పవలసినది గాని మూడు సంగతులే చెప్పిరి, పిశాచీ ఇది నీ పని. రాత్రి నాకు చెడ్డ కలవచ్చినది, పిశాచీ ఇది నీ పని. మొన్న నాకు తప్పుడు దర్శనము వచ్చినది, పిశాచీ ఇది నీ పని. పోయినవారము నాకు ముల్లు గుచ్చుకొన్నది, పిశాచీ ఇది నీ పని. నేను అజాగ్రత్తగా నున్నందున రాయి కాలికి తగిలినది, పిశాచీ ఇది నీ పని. స్నానము చేయునప్పుడు మా శరీరము మీద మట్టి కనబడును, పిశాచీ ఇది నీ పని. కొందరు జీవములేని రాళ్ళకు మ్రొక్కుచున్నారు, పిశాచీ ఇది నీ పని. లోకములో ఖూనీలు, హత్యలు జరుగుచున్నవి, పిశాచీ ఇది నీ పని. ఒక్కొక్కప్పుడు అన్యాయమే గెలుచుచున్నది, పిశాచీ ఇది నీ పని. చెడ్డబొమ్మలు, సినిమాలు అనేకులను ఆకర్షించుచున్నవి, పిశాచీ ఇది నీ పని. అనేకమంది భక్తులు విలాసముల తట్టు ఆకర్షింపబడుచున్నారు పిశాచీ ఇది నీ పని. క్రైస్తవ

దేవాలయములు నిర్మించుటకు అనేక ఆటంకములు కలుగుచున్నవి, పిశాచీ ఇది నీ పని. పాపము విస్తరించుట, పిశాచీ ఇది నీ పని. మంచి నెరవేరకపోవుట, పిశాచీ ఇది నీ పని. నీ పని అంతటిలో చెడుగే కాని మంచి లేనే లేదు. ఏది చెడుగో, పిశాచీ అది నీ పని. మా పొరపాట్లు అయినా, అవి నీ వలననే కలిగెను గనుక అదికూడ నీ పని లోపమే.

28) దేవుడు లేడు, దేవదూతలు లేరు, మోక్షములేదని నాస్తికులు అనుచున్నారు, ఇదంతయు ఓ పిశాచీ నీ పని. దేవుడు కలుగజేసిన ప్రతి వాటిలో, తరచుగా ఏదో ఒకటి నాశనమగుచున్నది, పిశాచీ ఇది నీ పని. సాలీలు చీరెలు నేయుచుండగా దారము తెగిపోయినది, పిశాచీ ఇది నీ పని. ప్రార్ధన చేయుచుండగా కోళ్ళు, కుక్కలు అల్లరిచేయును, పిశాచీ ఇది నీ పని. గోళ్ళు కత్తిరించుకొనబోతే తెగినది, పిశాచీ ఇది నీ పని. మా చేతిలోని వస్తువులు జారి పడిపోవుచున్నవి, పిశాచీ ఇది నీ పని. ఒక విద్యార్థి చాల కష్టపడి చదివి పరీక్షలలో ఫెయిలైనాడు, పిశాచీ ఇది నీ పని. ఒక స్త్రీ, చల్లని పానీయమనుకొని కార్బాలిక్ ఏసిడ్ త్రాగి చనిపోయినది, పిశాచీ ఇది నీ పని. కడుపులో బిడ్డలు చనిపోవుచున్నారు, పిశాచీ ఇది నీ పని. అకాల మరణములన్నియు, ఓ పిశాచీ నీ పని. ఒక బోధకుడు వీధిలో బోధిస్తుంటే, మనుష్యులతనిని పట్టుకొని కొట్టిరి, పిశాచీ ఇది నీ పని. కొందరికి ట్రైన్ (రైలుబండి) దాటి పోయినది, పిశాచీ ఇది నీ పని. ఒకరు మరలో పనిచేస్తుండగా, పొగవలన కండ్ల జబ్బు చేసినది, పిశాచీ ఇది నీ పని. ఒకడు పడవ ఎక్కబోయి నీటిలో పడ్డాడు, పిశాచీ ఇది నీ పని. కష్టములను బట్టి ఏడ్చుట, పిశాచీ ఇది నీ పని. ఒక పని చేయబోయి మరియొక పని చేయుట, పిశాచీ ఇది నీ పని. మనుష్యులవలె జంతువులకును జబ్బుచేయుచున్నది, పిశాచీ ఇది నీ పని. *(ఈ తప్పులన్నియు పిశాచివని అనుకొనరు, మనుష్యులవే అనుకొందురు).*

29) ఓ పిశాచీ! నీకు ఎప్పుడైనను దేవుని నమ్ముట తెలుసునా? తెలియదు. ఒకరిని నమ్మకుండచేయుట మాత్రము నీకు తెలుసును, నీవు కూడ నమ్మవు.

30) 'యెహోవా నా మొఱ లాలించెను' అనే కీర్తనలోని వచనము.

"పిశాచి కడిమి బడగొట్టెను - దన వశాన నను నిలువబెట్టెను =
ప్రశాంత మధుర సు -విశేష వాక్ఫుల నిశాంతమున జేర్చి సేద
దీర్చెను".

షరా: **కడిమి** అనుమాటకు బదులుగా, ఈ దిగువ ఉదహరించిన మాటలన్నిటిని వాడి, సాతాను నెదిరించు పాటగా పాడుకొన వచ్చును.

మాయ, శక్తి, బలము, భీతి, భయము, ముఖము, చేయి, వాక్కు, పధము, విధము, నడుము, భుజము, తలపు, ఉనికి, పలుకు, ఊహ, టక్కు, వ్యూహము, పట్టు, కట్టు, ఈటె, మాటు, సేన, దండు, కాడి, పీడ, కాటు, పనులు, మనస్సు, పరువు, గణము, చోటు, గుండె, చూపు, హక్కు, శిరస్సు, మబ్బు, ప్లాను, డాబు, గద్దె, మురుపు, నీడ, దుర్బుద్ధి, ముసుగు, గర్వము, పాదము, ఉదరము, క్రియలు, తంత్రము, ఛాయ, కక్ష, మందము, వినికి, జ్ఞానము, మంత్రము.

## 2. సాతానుపై జయము

31) ఓ సైతానా! అంతెక్రీస్తు, అబద్ధ ప్రవక్త , దయ్యములు అగ్ని గుండములో పడవేయబడుననియు, సాతాను పాతాళములో వెయ్యేండ్లు బంధింపబడుననియు, వ్రాయబడిన వ్రాతలు నీవు చదువలేదా? అయినను, నీవు బహుబింకముతో ఏమియు నేరములేనట్టు మాట్లాడుచున్నావు.

32) ఓ సైతానా! నీకు అపజయము కలిగినట్లు, బైబిలులో అనేక స్థలములున్నవి. అవి మాకు ధైర్యము కలుగజేయుచున్నవి. యేసుప్రభువు మాకు ఆదరణ, ధైర్యము ఇచ్చు మాటలు బైబిలంతటా వ్రాయించెను. అవి మాకు ధైర్యము కలుగజేయుచున్నవి.

పాట: **దివ్యగ్రంథము, దివ్యగ్రంథము**
**ఎచ్చటనైన వెదకిన సహాయము దొరుకును**
**కష్టములు వచ్చిన, నష్టములు వచ్చిన**
**విడువకుండ చదువుడి దివ్యగ్రంథము**

33) ఓ సైతానా! తుదకు నీ రాజ్యము పూర్తిగా కూలిపోవుననియు, క్రీస్తు రాజ్యము పైకి వచ్చుననియు ప్రకటన గ్రంథములోనున్నది. అది ఎప్పటికైనా నెరవేరును గదా! ఇది నీకు తెలిసియు మా మీదికి దండెత్తుచున్నావు.

34) ఓ సైతానా! నీకు విరోధి అని పేరు వచ్చినది. ఇది బైబిలులో ఉన్నది. కాబట్టి నీవు విరోధివి కాని స్నేహితుడవు కావు. (దైవ) విరోధులు నరకమునకు వెళ్ళుదురు. తిన్నగా నరకానికి వెళ్ళే నీవు, ఏ ముఖము పెట్టుకొని మా దగ్గరకు రాగలవు?

*35) ఓ సైతానా! యేసుక్రీస్తు ప్రభువు సాతానును అతని అనుచరులను, పాపములను, పాపఫలితములను జయించి నరకములో వేసినారని దైవ గ్రంథములో నున్నది. అది ఎవరికి బదులుగా చేసిన జయమని అనుకొను చున్నావు? నీకు బదులుగా చేసిన జయమని మురుస్తున్నావా ఏమిటి? లేదు* ఆయన మా కొరకు చేసిన జయము, అది మా జయము. మేము జయించినట్లే. *జయించిన వారి మీద ప్రగల్భాలు చూపించుటవల్ల నీకేమి ప్రయోజనము? నీవు మరింత పాపము పోగుచేసికొనుచున్నావు. లోకములోని భక్తులందరిని ఈలాగే చెరిపి వేయుచున్నావు.*

36) ఓ సైతానా! మా దోషములు నీ చెవిని బడకుండ, మా యేసుప్రభువు చేయలేడా! ఆయనకు శక్తిలేదా! ఆయన సర్వశక్తుడు కాడా! మేము ఆయనను ప్రార్థిస్తే ఏమితప్పు? మా ప్రార్థనలో, మా నడకలో, మా సంఘములో తప్పులు పట్టుచున్నావు. నీలోని తప్పులు చెప్పుకొనవు, ఎందుచేత? ఎక్కువ తప్పులు ఎవరిలో నున్నవి? గ్రహించుకొనవు. నీలోని దూలమును తీసివేసికొనవు. మా కంటిలోని నలుసును చూడడమేల? క్రీస్తు ప్రభువునుబట్టి మా సంఘమునకు జయము. నీ క్రియలకు నాశనము.

37) ఓ సైతానా! '*తప్పులెంచువారు తండోప తండాలు...... తమ తప్పు లెరుగరు*' అను పద్యము నీకే చెల్లును.

38) ఓ సైతానా! నీవల్ల పడగొట్టబడిన పాపాత్ములందరు, పరమభక్తులై పరలోకములో నున్నారను సంగతి నీకు తెలియదా?

*39) ఓ సైతానా! దేవుడును, పరిశుద్ధ అవతార పురుషుడును అయిన యేసుప్రభువే, మమ్మును కనికరించి, ప్రేమించి, శుద్ధిచేస్తుండగా; ఈ కార్యములు చేయుటకు శక్తిలేని నీ లెక్కేమిటి మాకు?*

40) ఓ సైతానా! ఏమాయెను! ఏమాయెను! అపవాది యత్నాలు ఏమాయెను? వరుస ప్రయత్నాలు ఏమాయెను? మానవుల యత్నాలు ఏమాయెను? వేదన బాధలు ఏమాయెను? సమాధి యావత్తును ఏమాయెను? ఘాటు జాగ్రత్తలు ఏమాయెను?

41) ఓ సైతానా! మా ప్రభువు నిన్ను, నీ సైన్యమును, నీవు తెచ్చిపెట్టిన పాపమును, ఆ పాపము తెచ్చిపెట్టిన దుష్ట ఫలితమును, వ్యాధులను, అవమానములను, ఇబ్బందులను గెల్చినాడు. గనుక మేము కూడ వాటన్నిటిని గెలువగలము. నీవేమి చేయగలవు? మరియు సిలువ ప్రమాను మీద, మా ప్రభువుయొక్క శరీరమంతటిని నీవు బాధించినప్పటికిని ఆయన గెలిచినాడు. సహించుట వలన ఆయనకు జయము కలిగినది. ఆలాగే మా శరీరమునకు నీవెన్ని కష్టములు తెచ్చిపెట్టినను, ఆయన సహింపునుబట్టి మేము కూడ జయించ గలము. నీవేమి చేయగలవు? మరియు ఆయనను చంపించి, సమాధి చేయించినావు. కాని ఆయన బ్రతికి లేచినాడు. నీకిది తెలుసునా? అలాగే విశ్వాసులు చనిపోయినప్పటికిని తిరిగిలేచి, మోక్షమునకు వెళ్ళుదురు. అప్పుడు నీవేమి చేయగలవు?

42) ఓ సైతానా! ద్వితీయోపదేశ కాండమనే పుస్తకము, నిన్ను హడలు గొట్టుచున్నది. ఎందుకంటే నిన్ను జయించుటకు మా ప్రభువు వనవాసము చేయుచున్న కాలములో, ఆ గ్రంథములోని వాక్యములను తీసి నిన్ను చితుక గొట్టినాడు (ద్వితీ. 8:3, 6:13, 6:16; మత్తయి 4వ అధ్యాయము). సైతానా! నిన్ను ఎదిరించుటకు ఈ గ్రంథము నుండియే వాక్యము ఎత్తి, మా ప్రభువు నిన్ను జయించినాడు.

43) ***ఓ సైతానా! నీకు ప్రకటన గ్రంథమంటే హడలు.*** నీ కడవరి శిక్ష అందులో నున్నది. నీకు గొయ్యి, నరకము– ఈ రెండును ఉన్నవి. మాకదే ధైర్యము. ఎప్పటికైనా నీవు ఆ మట్టులేని గోతిలోనికి వెళ్ళేవాడవే, నిత్యాగ్ని నరకములోనికి వెళ్ళేవాడవే. నీకేమిటి భయపడేది? నీవే మాకు భయపడాలి. *మా ప్రభువును బట్టి ప్రకటనలోని సంఘమునకు జయము, సైతానా! నీకు అగ్నిభయము.*

44) ఓ సాతానా! 'అపవాదియొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను' (Iయోహాను 3:8) అను వాక్యములో, సాతానును వెళ్ళగొట్టుటకు అని లేదు, సాతాను క్రియలను లయపరచుటకు అని ఉన్నది.

స్తుతి: ప్రభుయేసు రక్తమునకు జయము. సైతాను (అపవాది) క్రియలకు లయము. ఇట్లనుటకు ఇదే మాకు సమయము.

'దేవా! తండ్రీ నీకు' అను కీర్తనలోని వచనము,

'సైతాను క్రియలకు సర్వనాశనము = నీ తలంపులకెల్ల- నెరవేర్పు నిజము'.

45) ఓ సైతానా! అవ్వకు నిషేధ ఫలము చూపించి మోసము చేసినావు. నీవు అలాగు మోసము చేసినందున, దేవుని కుమారుడు సిలువ వేయబడినప్పుడు ఆయన కాళ్ళక్రింద నిన్ను సిలువవేయునని నీకు తెలియదు.

46) ఓ సాతానా! ఒక దొంగ మొదటిసారి దొంగతనము చేస్తే, మొదటి శిక్ష. రెండవసారి చేస్తే రెండు శిక్షలుండును. అలాగే ఆదాము హవ్వలు మొదలుకొని, ఎన్నికోట్లమందిని మోసముచేసినావో, ఎన్ని పర్యాయములు మోసము జరిగినదో, అన్ని పర్యాయములు నీకు శిక్షయే. ఆఖరు శిక్ష నరకాగ్ని. ఇన్ని శిక్షలున్నప్పటికిని నీకు బుద్ధిలేదు, మొండివాడవు. బుద్ధిలేనివారికి, మొండివారికి దేవుడే బుద్ధి చెప్పవలెను. అనగా నిన్ను శిక్షించుటే. మనిషి తప్పు చేస్తే దేవుడు శిక్షించి, రక్షించును. దయ్యములకు అలాగు కాదు. ఆయన వాటిని శిక్షించుటయే గాని రక్షించడు. ఉదా: నెపోలియన్ చక్రవర్తి యుద్ధ కాలములో, శత్రువులను పట్టుకొని ,అనేకులను ఖైదులో వేయించెను. దగ్గరనున్న కమిటి వారిని పిలిచి ఈ ప్రశ్న వేసెను. 'ఖైదులోనున్న శత్రు పటాలమును లెక్కించుమనెను'. నెపోలియన్ సైన్యముకన్న, పట్టుబడిన శత్రుసైనికులే ఎక్కువ గలరు. వీరందరిని విడిచిన యెడల శత్రు సైన్యము ఎక్కువై. మనపైబడుదురు గనుక విడువమంటారా? అని ప్రశ్నించెను. కొందరు విడిచిపెట్టమనిరి. ఇంకా మీరు చెప్పవలసినది ఏమైనా గలదా? అని అడుగగా, కమిటి వారు- 'మీరే సెలవియ్యండని' జవాబిచ్చిరి. అందుకు నెపోలియన్- 'అందరిని విడిచినా, వారు వీరు కలిసి మనలను ఓడింతురు. గనుక తుపాకితో అందరిని కాల్చి చంపండనెను'. ఈ వార్త శత్రువులు విని భయపడి, పటాలమును వెనుకకు తీసుకొనిపోవుదురని చెప్పెను. అట్లే ఒక

దయ్యమును విడిచిపెడితే, పదివేలమంది విశ్వాసులను నాశనము చేయును. అందుకు ఏమి చేయవలెను? కాల్చివేయ వలెనా? కాల్చివేయుట అంటే భూతముల కొరకు అగ్నిగుండము కాచుకొని యున్నది. ఓ భూతమా! నీకు అంత గడువిచ్చి, దయతో నిన్ను శిక్షింపకుండ ఉన్నందులకు, నీవు సృష్టికర్త వారికి ఎంత కృతజ్ఞుడవై యుండవలెను! కాని రక్షింపబడిన భక్తులను చెడగొట్టుటకు, వారిమీదికి వెళ్ళుచున్నావు గనుక నీకిది వినిపించుచున్నాము.

47) ఓ సైతానా! ఎలీషా తన సేవకునితో– 'శత్రువుల దండు కంటే మన దండే ఎక్కువని' చెప్పలేదా? సైతానా! నీవు దండెత్తినా, నీ దండుకంటే మా సైన్యమే ఎక్కువని నీకు తెలియదా? *నీవు బాగుగా చదువవు, ఎంత బుద్ధిహీనుడవు!*

48) ఓ సైతానా! ఋషులు లోకమునకు వేరుగానుండి, లోకమంతటి కొరకు ప్రార్థించుచున్నారు. మేము లోకములో ఉండి, లోకమంతటి కొరకు ప్రార్థించుచున్నాము. మా ప్రార్ధనలు కొట్టివేయబడవు. ఈలాగు నిన్ను, నీ సైన్యమును జయించుదుము. నీకు నాశనమే తెలిసికో, వారి ప్రార్థనలకుండే శక్తి వారికున్నది. మా ప్రార్థనలకుండే శక్తి మాకున్నది. *ఈ రెండు శక్తులు గల ప్రార్ధనల వలన నీకు నాశనమే.*

49) ఓ సైతానా! మా పక్షముగా పరలోకపు దేవదూతలు, భూలోకపు ఋషులు పటాలముగా నున్నారు. ఈ రెండు పటాలముల సహాయమున నిన్ను తప్పక గెలుస్తాము.

50) ఓ సైతానా! నీవు గెలువగల కీడు ఉద్దేశించితివి. కాని అది మాకు మేలుగా పరిణమించెను. మాకు జయము కలుగుటలో ఆ మేలు కనిపించినది. గనుక ఓ సైతానా! నీకే కీడు.

51) ఓ సైతానా! నీ రాజ్యమును, నిన్ను పడగొట్టవలసినదని భక్తులు చేసిన ప్రార్ధనలు అన్నియు, నేడు పూర్తిగా నెరవేరనై యున్నవి. మాకు సంతోషము, నీకు నిత్యదుఃఖము. మాకు జయము. నీవు ఎంత మందిని ఏడ్పించినావో ఆ శాపము నీకు తగులును.

52) ఓ సైతానా! త్రాచుపామును నెమలి తినుచుండును. ఒకదరి నుండి పాము దానిని కరచుచుండును. ఈ రెండు పనులు జరుగుచున్నప్పుడు, పాము

పని అయిపోవును. ముంగిస పామును చూడగానే, పరుగెత్తుకొని వెళ్ళి కొరికి వేయును. విశ్వాసులు ఎప్పటికైన ఓ సాతానా! నిన్ను జయించక మానరు.

53) ఓ సాతానా! నీవెందరిని శోధించినావో, నీకన్ని శిక్షలు. ఎన్ని పర్యాయములు శోధించినావో, నీకన్ని శిక్షలు. ఎన్ని శోధనలు ఏర్పరచినావో, అన్ని శిక్షలు.

## 3. సైతానుకు మారుమనస్సు లేదు

54) ఓ సైతానా! 'మేము మారుమనస్సు పొందలేదని' నీవు అభిప్రాయపడు చున్నావు. నీవు మారుమనస్సు పొందినావా? నీవు పొందనిదే, ఇంకొకరిని అనుటకు నీకధికారము, శక్తి (పవర్) ఎక్కడిది?

55) ఓ సైతానా! తీర్పు తీర్చు నీవు దోషివై యుండగా, ఇతరుల మీద ఎందుకు తీర్పు తీర్చుచున్నావనే బైబిలు వాక్యమెత్తినావు. దోషివైన నీవు ఎందుకు తీర్పు తీర్చుచున్నావు? నీవు ఎప్పటికిని మారవని ప్రకటన గ్రంథములో ఉన్నది కదా!

56) ఓ సైతానా! మనిషిలో నీవు ఎంత చెడుగు ప్రవేశపెట్టినను, రవ్వంతైనా మంచి ఉండక మానదు. అది దేవుడు పెట్టిన వజ్రము. అది చూచియైనా నీవు మారుమనస్సు పొందవు. అదికూడ తీసివేయుటకు నీవు ప్రయత్నించు చున్నావు. కాని మనిషిలోని మంచిని గ్రహించవు, ఎంత తెలివి తక్కువవాడవు!

57) ఓ సైతానా! మాలో ఒకరిట్లు ప్రార్థించినారు. 'దేవా! సైతానుకు, అతని దూతలకు మారుమనస్సు కలిగించి, ఆకాశ విశాలమందు ఎక్కడో ఒక్కచోట పెట్టుము, కాని నరకాగ్నిలోనికి పంపవద్దు'. సైతానా! ఇట్టి ప్రార్థన జరిగినప్పుడు కూడ నీవు సంతోషించ లేదు, మారుమనస్సు కలిగించుకొనలేదు. సరే, నీ శిక్ష నీవే అనుభవించుము.

58) ఓ సాతానా! ఒకరిట్లు ప్రార్థించినారు. 'దేవా! మనుష్యులలో ఎవ్వరిని నరకములోనికి వెళ్ళనీయకుము'. సైతానా! ఇప్పుడైనా మారుమనస్సు పొందుదువా! శోధించుటకు ఇక నీకు మనుష్యులు దొరకలేరు.

59) ఓ సాతానా! మేము చేస్తున్న ప్రార్థనలు, మీటింగులు నీకు తెలుసును. నీకు జయము కలుగదని నీవు బాగుగా ఎరుగుదువు. **ఇప్పుడైనా మారుమనస్సు పొందుము.**

60) దుష్టుడవైన ఓ సైతానా! మా ప్రభువు యోవేలు గ్రంథమందు, 'అంత్య దినములలో తన ఆత్మను యౌవనుల మీదను, వృద్ధుల మీదను కుమ్మరిస్తానని' చెప్పినాడు. ఆ వాక్యాధారము చేసికొని, నీవు మాయొక్క బిడ్డలలో ప్రవేశించి, అల్లరి చేయుటకు నీకు సిగ్గులేదా? మారుమనస్సు అక్కరలేని నీవు, ఇతరులను మారమని అన్నావు. అందులో అర్థమున్నదా? అయినను, ప్రభువు మాకు మెళకువ దయచేసి, నీ బారినుండి రక్షించి, తన ఆత్మాభిషేకము దయచేసినాడు. దీనిని బట్టి నీకు, నీ క్రియలకు లయము. మా ప్రభువునకు, ఆయన సంఘమునకు, ఆయన బిడ్డలకు, మాకు ఎల్లప్పుడు జయమే. ఓ భూతమా! ఇదిగో మా బిడ్డలు బాగుపడతారని మాకు తెలుసును. ఎందుచేతననగా, మా పరలోకపు తండ్రియైన దేవుడు ఇచ్చిన జ్ఞానమును బట్టి తెలుసును. 'మా బిడ్డలు బాగుపడుదురు' అను విశ్వాసము మాకు కలదు. అట్టి విశ్వాసము నీకు లేదు. నీవు నాకంటె తక్కువ, నీవు నా కాళ్ళక్రింద దానివే.

## 4. సైతాను నేరములు మోపలేడు

61) ఓ సైతానా! నీవు మాకు తీసికొని వచ్చి అందిస్తున్న గొప్ప నేరములు, ఎవరి మీదను మోపుటకు నీకు అధికారము లేదు.

62) ఒక మొదటి చిన్నవాడు, రెండవ చిన్నవానిని పడద్రోసిన యెడల, పడినవాడా నేరస్థుడు? పడద్రోసిన వాడా? నీవు పడవేసేవాడవు గనుక నీవే గొప్ప నేరస్థుడవు. పడవేయబడిన ఆదాము హవ్వలను, దేవుడు క్షమించి దీవించినాడు. నిన్ను దీవించలేదు. అలాగే నేటివరకు జరుగుచున్నది. గోత్రకర్తయగు యూదా, దావీదు మొదలగు వారిని నీవు పడవేసినావు. వారు రక్షించబడి, క్షమించబడి, దీవించబడి గొప్ప పని చేసిరి. పడవేసిన నీవు దీవించ బడలేదు, వారివలె గొప్ప పని చేయగలిగినావా?

63) డాక్టరు మార్టిను లూథరు యొద్దకు, నీవు అతని పాపముల జాబితాను తీసికొని వెళ్ళినావు. ఆయన నా వలె బెదరలేదు, ఎదిరించినాడు. "యేసుప్రభువు నా పాపములు తుడిచి వేసినాడు, ఓ సాతానా! నీవు నా మీద నేరములు మోపలేవని" గద్దించగా, నీవు పారిపోయినావు. ఇట్లు పారిపోయే, నీకా మేము బెదరడము!

## 5. అపవాది, అపరాధి

64) ఓ సాతానా! అపవాది, ప్రతివారియొక్క పాపములను గురించి నాకు చెప్పుచున్నాడని, దేవుడు ప్రకటన గ్రంథములో వ్రాయించినాడు. ప్రకటన 12:10. నీవు అపవాదివని మా తండ్రి వలన పేరుపొందినావు. అపవాది అనగా ఒకరిలో నేరములు లేనిదే, నేరములు మోపేవాడవని అర్థము. ఎవరి పాపములు క్షమించబడెనో, వారు అపరాధులు కారు. క్షమింపబడిన పాపములు ఎత్తి చూపించు నీవే అపరాధివి.

65) ఓ సాతానా! నీకు మా తండ్రి, 'అపవాది'యని పేరు వాడినాడు. నీవు విశ్వాసుల మీద మా ప్రభువు వద్ద, ఎప్పుడు చాడీలు చెప్పుచున్నావు. "నీవు విశ్వాసులను తిప్పలు పెట్టేటప్పుడు, వారు నిన్ను గూర్చి నాయొద్ద చెప్పుకుంటారు గనుక నేను వచ్చి నిన్ను తోలివేస్తాను. అదే కాదు, నీవు చెప్పిన నేరముల జాబితా అంతా నేను కొట్టివేసినానని" ప్రభువు చెప్పుచున్నాడు.

66) ఓ సాతానా! నీకు సమయము లేదనిచెప్పి, నీవు మనుష్యులను పాపములో పడవేయుచున్నావు. కాని నీవు కోరినట్లు, నేను నీ మాటలు విని, విశ్వాసులకు తీర్పు విధించనని ప్రభువు చెప్పుచున్నారు. ఓ చాడికోరా! సిగ్గుపడి వెళ్ళిపో.

## 6. సైతానుకు నాశనము

67) ఓ సాతానా! మేము నీ నాశనము ఎరిగినవారము. నీకు నాశనము ఉన్నదని నీకు తెలియదు గాని మాకు తెలుసును. నీ ముఖము, నీ చెంపలు పగులగొట్టుటకు మాకు శక్తియున్నది. మా రహస్యాలు వినుటకు నీకేమి అవసరము? మా రహస్యాలతో నీకేమి కావాలి? మా రహస్యాలు మా తండ్రికి తెలియజేస్తే చాలు, నీవెవరు మా రహస్యాలు వినుటకు? నీకు సిగ్గులేక, రోజు మా చేత చీవాట్లు తినుటకు వస్తున్నావు. మేమిచ్చే గద్దింపులు నీకే కాదు, నీ జట్టంతటికిని. ఎలాగంటే, ఈ గదిలోనున్న స్విచ్‌నొక్కితే, బైట లైట్లన్నిటిలోనికి కరెంటు వెళ్ళినట్లు, నిన్ను ఇక్కడ గద్దించినట్లయితే కరెంటువలె ఆ గద్దింపులు నీ జట్టు ఎక్కడెక్కడ ఉన్నారో, వారందరికి పరిణమిస్తుంది. దినదినము మా దగ్గరకు రావడము ఎందుకంటే చీవాట్లకే, నీకు సిగ్గులేదా?

68) ఓ సాతానా? లోకమును గూర్చి ప్రార్థింప వద్దంటున్నావు. లోకమును నీవు పుట్టించినావా? నీవు సృష్టికర్తవా? ప్రభువు మా కొరకు కలుగజేస్తే నీదంటావు ఏమిటి? నీ కొరకు లోకమును కలుగజేయలేదు. నీ కొరకు కలుగజేసినది ఏమిటో మాకు తెలుసును, అది నరకము. సంధి వచ్చినవాడు మాట్లాడినట్లు, నీవు మాట్లాడు చున్నావు. అదంతా మాకు తెలుసు, నీకు నాశనమే.

69) ఓ సైతానా! మేము పాపులమైనా పరిశుద్ధులమే. ఎందుకంటే మాకు పాపక్షమాపణ ఉన్నది గనుక. నీకు పాప క్షమాపణ లేదు, నాశన పాత్రుడవు.

70) ఓ సైతానుల్లారా! మా ప్రభువే మీ పని పడతాడు లెండి, తొందర పడకండి, మీ నాశనము దగ్గరపడినది. భూమి పుట్టినది మొదలుకొని, ఇప్పటివరకు మీరు ఎంత మందికి హానిచేశారో జ్ఞాపకము చేసికొనండి. ఆ హాని అంతా మీ నెత్తిమీద పడునుగాక! మీరు ఇదివరకే శపింపబడిన వారు. కాబట్టి మేము కూడా మిమ్మును శపించుటకు మాకు సందు దొరికినది.

71) ఓ సైతానా! మా తండ్రి తన సృష్టిని ప్రతి నిమిషము దీవిస్తున్నాడు. యెషయా 27:3. ఆ నిమిషములోనే దీవెనలకు వ్యతిరేకమైన శాపము నీమీదికి, నీ అనుచరుల మీదికి వచ్చుచుండును. ఏలాగంటే ఒక తరగతిలో, 25గురు విద్యార్థులు పరీక్షకు వెళ్ళగా 5గురు ఫెయిలైనారు. ఆ అధికారి, పాస్ అయిన 20 మందికి ప్రజంట్లు ఇచ్చినాడు. అంటే 5గురికి ఇయ్యలేదని అర్థముకదా! అలాగే దేవుడు ఆదాము, హవ్వలను దీవించినప్పుడు, 'సైతానా! నేల మన్ను తిందువని' నిన్ను శపించెను. మనుష్యులకు ఆ శాపము లేదు. వారికి మరుగైన పంట, సంతానము అను రెండు బహుమానములు ఉన్నవి. వీరికి ఉంటే, నీకు లేదనే కదా అర్థము. మరియు ఒక విమోచకుని పంపిస్తానని సృష్టికర్తవారు అన్నారు. అది పుట్టబోవు నరులందరికిని దీవెన. అటువంటి దీవెన నీకున్నదా? లేదు. శాపము ఉన్నది. మీరందరు శాపగ్రస్థులు గనుక నరక వంశస్థులు. నరక వంశస్థులకు నాశనము, యేసు ప్రభువునకు జయము.

72) ఓ సైతానా! నరకము నీకు, నీ దూతలకు ఏర్పడినది. నరకము మాకు కాదు. గనుక నరులకు నరకమని మాయగ నీవు మోసము చేసినావని సంతోషించ నక్కరలేదు. నీకు నరకమని రికార్డు చేయబడియున్నది గాని మనిషికి రికార్డు

చేయబడలేదు. (మత్తయి 25:41,46). నరులు నిత్యశిక్ష పొందుదురని మాకు చూపుదువేమో! అయితే సృష్టికి ముందే నీకు నరకము రికార్డు చేయబడినది. కాని అటు తరువాత చాల కాలమునకు నిన్ను బట్టి మాకు వచ్చినది గనుక నీకే గొప్ప బాధ.

### 73) సాతానుకు నిత్యనాశనము - ప్రభువునకు నిత్య స్తుతి.

| | |
|---|---|
| 1. ఓ సాతానా! నీకనంతకాల నాశనము. | ఓ ప్రభువా! నీకనంతకాల స్తుతి |
| 2. ఓ అబద్ధికుడా! నీకనంతకాల నాశనము | ఓ సత్యదేవా! నీకనంతకాల స్తుతి. |
| 3. ఓ నేరస్థుడా! | ఓ నేరములేని ప్రభువా |
| 4. ఓ నేరము తెచ్చినవాడా! | ఓ నేరము తీసివేసిన ప్రభువా! |
| 5. ఓ ఓడిపోయినవాడా! | ఓ జయించిన ప్రభువా! |
| 6. ఓ పాపీ! | ఓ పాపమును తీసివేసిన తండ్రీ! |
| 7. ఓ దొంగవాడా! | ఓ ద్వారమైన తండ్రీ! |
| 8. ఓ అపజయపరుడా! | ఓ జయించిన ప్రభువా! |
| 9. ఓ బాధపెట్టే వాడా! | ఓ బాధ తీసివేసిన రక్షకా! |
| 10. ఓ చాటుననుండే వాడా! | ఓ బహిరంగములోనున్న దేవా! |
| 11. ఓ నాశన పాత్రుడా! | ఓ కాపుదల కర్తా! |
| 12. విశ్వాసులను బాధపెట్టే వాడా! | ఓ విశ్వాసుల బాధ తీసివేసే తండ్రీ! |
| 13. ఓ దేవుడు లేడనేవాడా! | ఓ సర్వము సృష్టించిన దేవా! |
| 14. ఓ విశ్వాసుల విరోధీ! | ఓ విశ్వాసుల స్నేహితుడా! |
| 15. ఓ విశ్వాసి ఆరోగ్యము పాడు చేయువాడా! | ఓ విశ్వాసికి ఆరోగ్యమిచ్చిన తండ్రీ! |
| 16. ఓ దేవునికి దూరస్తుడా! | ఓ దైవజనునికి సహవాసీ! |
| 17. దైవజనుని పని పాడుచేయు వాడా దైవజనుని పనిని పాడుచేయ చూచువాడా! | దైవజనుని పని స్థిరపరచు రక్షకా! నీకు ప్రణుతులు. |

Bible Mission HQ Guntur

| | |
|---|---|
| దైవజనుని బాధపెట్టేవాడా! | దైవజనుని బాధ తీసివేసే నాధా! |
| 18. దైవజనుని ఆహారము పాడుచేయ చూచువాడా! నీకనంత నాశనము. | దైవజనునికి ఆహారము ఇచ్చిన తండ్రీ! నీకు అనంతకాల సంస్తుతులు. |
| 19. దైవజనునికి విరోధ భూతములను నిలిపినవాడా! నీకనంతకాల నాశనము. | దైవజనునికి పరిచారక దూతల నిచ్చిన తండ్రీ! నీకనంతకాల సంస్తుతులు. |
| దైవజనుని విరోధీ! | దైవజనుని ప్రేమించిన ప్రభువా! |
| 20. దైవజనుని సదుపాయములు భంగము చేయువాడా! | దైవజనునికి సదుపాయముల నిచ్చిన తండ్రీ! |
| 21. ఓ చెడిపోయినవాడా! | ఓ జయించిన ప్రభువా! |
| 22. ఓ చీకటివాడా! నీకనంతకాల నాశనము. | ఓ వెలుగుగైయున్న దేవా! నీకు అనంతకాల స్తుతి. |
| 23. ఓ పారిపోయేవాడా! | ఓ కదల్చబడని రక్షకా! |
| 24. ఓ కుమ్మరాలు తెచ్చేవాడా! | ఓ కుమ్మరింపు ఇచ్చే తండ్రీ! |
| 25. ఓ వ్యాధిని తెచ్చేవాడా! | ఓ వ్యాధిని సిలువపై భరించిన యేసుప్రభువా! |
| 26. వ్యాధికి మూలమైనవాడా! | వ్యాధిమూలము పెరికిన వైద్యుడా! |
| 27. ఓ నిర్దయుడా! | ఓ దయగల దేవా! |
| 28. ఓ కనికరము లేనివాడా! | ఓ కనికరముగల దేవా! |
| 29. మందను చెదరగొట్టువాడా! | మందను సమకూర్చువాడా! |
| 30. మహిమ పోగొట్టుకొన్నవాడా! | మహిమయై యున్న దేవా! |
| 31. ఓ పారుపోతా! | ఓ పాపికాశ్రయుడా! |
| 32. ఓ గాయపర్చువాడా! | ఓ గాయము మాన్పిన రక్షకా! |
| 33. ఓ పడద్రోయువాడా! | ఓ పట్టుకొనే ప్రభువా! |

Bible Mission HQ Guntur

# 7. యేసుప్రభువు రక్షకుడు

74) ఓ సైతానా! నీతిపరులు ఏడుమారులు పడినా, లేస్తారని వాక్యములో నున్నది గదా! పాపస్థితిలో నున్నప్పటికిని, ఎవరి దృష్టి యేసుప్రభువుమీద ఉండునో, అతడే నీతిపరుడు. ఆస్పత్రిలో చావ సిద్ధముగా నున్న రోగి, ఎవరిని తలంచు కొనుచుండును? డాక్టరుగారిని కదా! అలాగే కొందరు బలహీనస్థితిలో నున్నప్పటికిని, వారు యేసు ప్రభువును తలంచుకొనుచుండిన తుదకు రక్షింప బడుదురు.

***75)*** ఓ సైతానా! ఒకవేళ ఒకడు ఆత్మీయ బలహీనతలో ఉంటే, అతడు ఎల్లప్పుడు పడునని ఎక్కడ వ్రాయబడి యున్నది? అతడు తుదకు మారిపోవును. క్షమాపణ పొందునని అతనికి తెలుసును. అందుచేత క్షమాపణ రాకముందే, క్షమాపణ పొందిన వాడగును. మార్కు 11:24నుబట్టి చూస్తే, నెరవేరకముందే నెరవేర్పని ఉన్నది కదా! కనుక ఒకడు బలహీనతలో నున్నప్పుడు, నన్ను *యేసుప్రభువు ముందుకు బాగుచేయునని అనుకొనుటే విశ్వాసము.*

76) ఓ సైతానా! ఎటువంటి పాపికైనా, యేసుప్రభువును తలంచిన పాపక్షమాపణ కలుగును. నీవు ఘోరపాపుల కంటె ఘోరపాపివి. అయినప్పటికిని యేసుప్రభువును నీ రక్షకునిగా తలంచుకొనవు. కనుక నీకు రక్షణ దొరకదు. నీ వల్ల పడిపోయిన వారికి రక్షణగాని నీకు మాత్రము లేదు. అయినను చాల గడుసుగా మాట్లాడినావు. నీ గడుసుతనము యేసుప్రభువువద్ద వల్ల పడదు.

77) ఓ సైతానా! నీవు మనిషిని పాపములో పడవేయుట మాత్రమేకాక, పడ్డాడని పకపక నవ్వుచు, 'నీకు క్షమాపణ లేదులే' అని బెదిరించే వాడవై యున్నావు. నీ గడుసుతనమే నరులకుంటే, నీవు వెంటనే జయింపబడుదువు. నిన్ను జయించడము మా ప్రభువుయొక్క జయమును బట్టియే.

78) ఓ సైతానా! యుద్ధములో పటాలానికి, మొదటి దినమునే జయము కలుగునా? అలాగే భక్తులకు మొదటి దినముననే జయము కలుగక పోయినను, తరువాత కలుగును. అది నీకు తెలియదు.

79) ఓ సైతానా! మా శత్రువులు మా నాశనము కోరుచున్నారు గాని మేమైతే వారి రక్షణ కోరుచున్నాము.

80) ఓ సైతానా! నీకు శోధకుడని పేరువచ్చినది. విశ్వాసికైతే బోధకుడని పేరు వచ్చినది. నీవు పాపములో పడవేయుటకు మనుష్యులను శోధిస్తావు. కాని విశ్వాసులు, నీవు పాపములో పడవేసిన వారిని రక్షించుటకు బోధిస్తారు. గనుక నీకు కలిగిన పేరు చెడ్డపేరు, నీకెప్పుడును చెడుగే.

81) ఓ సైతానా! బంతి ఆడునప్పుడు, ఒకరు కాళ్ళు కొట్టుకొని పోవునంతగా పడిపోవును. అయినను, లేవనని అనుకొనరు. తక్కిన వారువచ్చి లేవనెత్తుదురని అనుకొందురు. అలాగే సైతానా! నీవు ఒకరిని పడవేసినప్పటికిని, వానిని లేవ నెత్తుటకు బోధకులు, పరిశుద్ధులు, దేవదూతలు మొదలైన వారున్నారు గనుక పడినను నిరాశ పడనక్కర లేదు. ఎన్నో ఏండ్ల క్రిందట నీవు పడ్డావు. నిన్ను లేవనెత్తడానికి ఎవరైనా వచ్చినారా? ఒకరు పాపములో పడిపోయినప్పుడు క్షమించు మనిన, వెంటనే దేవుడు క్షమించును. అయితే నీవనవు, ప్రభువు నిన్ను క్షమింపడు. నీకెంత దుర్గతి! నేను పడినయెడల ఎప్పటికైనా సద్గతే. మరణ సమయమందైనను నేను లేస్తాను.

## 8. నిరీక్షణ సంఘము

82) ఓ సైతానా! ఆదికాలము నుండి మా ప్రభువువచ్చే వరకు, నిరీక్షణ సంఘమును పడగొట్టుటకు నీవు ప్రయత్నములు చేసినావు. నీ ప్రయత్నములు నెరవేరలేదు. నిరీక్షణ సంఘము మా ప్రభువు వచ్చే వరకు ఉన్నదా, లేదా? నీవల్ల ఏమగునని, ఇన్ని దుష్టప్రయత్నములు మనుష్యునిచేత చేయించుచున్నావు? మమ్మునంటావు కాని, నీకింకా మార్పు రాలేదు. నీకు మార్పులేనిదే, మంచి కార్యములు ఎట్లు చేయగలరని మమ్మునంటున్నావు? నీకు మార్పు లేనిదే, మాకెట్లు చెప్పుచున్నావు, నీకు మహామార్పు ఉన్నదా ఏమిటి!

83) ఓ సైతానా! సంఘము యూదులలో, అన్యులలో స్థాపించిన తరువాత ఆపుచేయుటకు, ఇరువది వందల సం॥ల నుండి ప్రయత్నము చేయుచున్నావు గదా! నీ ప్రయత్నము సాగినదా? మా ప్రయత్నము సాగినదా? ఆటంకాలు దాటుకొని సంఘము నేటివరకు రాలేదా? ఇకమీదట అలాగుననే జరుగునని ఎందుకు గ్రహించలేవు? సామాన్య మనుష్యులమైన మేము గ్రహిస్తున్నాము గదా! ఒక్కొక్క మత జనసంఖ్యకంటె, క్రైస్తవమత జనసంఖ్య ఎక్కువని నీకు తెలియదా?

క్రీస్తునకు జయము, సంఘమునకు జయము. అపవాది క్రియలకు లయము. సాతాను క్రియలను లయము చేయుటకే, దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెనని ఉన్నది (యోహాను 3:8). అది నీకు తెలియదా?

84) ఓ సాతానా! క్రైస్తవమతము వృద్ధిపొందుటకు, భక్తులు చేసిన ప్రయత్నములు లెక్కకు మించినవి. ఆ ప్రయత్నములు నీవు ఆపుచేయ గలిగినావా! నీవు ఆపుచేయునప్పుడెల్లా, నీకు అపజయమే కలిగినది కదా! నీవు ఎందుకు మురియు చున్నావు? ఎన్ని అడ్డులైనా పెట్టుము గాని, దేవుని రాజ్యము ప్రబలము కాకపోదు.

85) ఓ సైతానా! ప్రవాహమునకు అడ్డువస్తే, త్రోసికొని పాయలు చేసికొని వెళ్ళును. అడ్డులు ఎత్తయి ఉంటే, ప్రక్కబడి ప్రవహించి సముద్రములో పడును. క్రైస్తవ సంఘమునకు ఎన్ని అడ్డులు వచ్చినా, త్రెంచుకొని మోక్షమునకు వెళ్ళక మానదు. నీలాంటి దుష్టులు కోటానుకోట్లు, ఈ సంఘమును ఆపుచేయలేరు.

## 9. ఇతర మతస్థులు

86) ఓ సాతానా! ఇతర మతస్థులు– 'బైబిలులో, మా ప్రభువులో, సంఘములో తప్పులున్నవని చెప్పుచు ప్రకటించుచున్నారు.' ఎవరి ప్రేరేపణవల్ల? నీ ప్రేరేపణ వలననే కదా! ఈ మూడు విషయములలో తప్పులున్నవని చెప్పగలవా? బైబిలులో తప్పులున్నవా? మా ప్రభువులో తప్పులున్నవా? మా సంఘములో తప్పులున్నవి గాని అవి క్రమముగా అంతరించి పోవును. అయితే, నీలోని తప్పులు అంతరింపవు.

87) ఓ దుష్ట సైతానా! ఈ కాలములో అనేకమంది నీ ప్రోద్భలమువల్ల, క్రీస్తు ప్రభువే దేవుడా? ఇతరులు మాత్రము దేవుళ్ళు కారా? అని అనుచున్నారు. ఇది నీవు తెచ్చిపెట్టిన తలంపే. అయితే ఇటువంటి తలంపు నెబుకద్నెజరునకు కలుగలేదా! నెబుకద్నెజరు చేయించిన ప్రతిమకు, సకల రాష్ట్రములవారు సాగిలపడి నమస్కరించినారు. కాని యౌవనస్థులైన షద్రకు, మేషాకు, అబెద్నెగో నిన్ను, నీ తలంపును, రాజుయొక్క ఆజ్ఞను లెక్కచేయక ఆ ప్రతిమకు నమస్కరింప లేదు. వారు అగ్నిగుండములో వేయబడినప్పటికిని దగ్ధమైనారా? వారిని వేయుటకు తీసికొని వెళ్ళినవారు కాలిపోలేదా? ఆ ముగ్గురిని పడవేసినవారు నీ జనులు,

నిన్ను ఆశ్రయించినవారు గనుక నశించిరి. అగ్నిగుండములో వేయబడిన ఆ ముగ్గురికి, ఒక వెంట్రుకయినను కాల లేదు. ఎందుకో తెలుసా? అద్వితీయ సత్యదేవుడున్నాడు గనుక. ఆయనను సేవించినవారు, ఏ మాత్రము నశించరు. ఓ సాతానా! ఆనాడు వారు ముగ్గురు నిన్ను జయించినారు. ఈనాడు మేము జయించలేమా? కాబట్టి ఆ విషయమై సిగ్గుతెచ్చుకొని తొందరగా పొమ్ము!

## 10. ఇతర మిషనులు, బైబిలు మిషను

88) ఓ సాతానా! ఇతర మిషనులవారికి, దేవుడు జ్ఞానముద్వారా బయలు పరచలేదని మేము చెప్పుట లేదు. అది నీ కల్పన. మాకు జ్ఞానముద్వారా కాక, ఆయనే స్వయముగా బైబిలు మిషనును బైలుపరచినాడని నిజము చెప్పు కొంటున్నాము. వారిని మేము హేళన చేయుటలేదు. నీవైతే వారిని, మమ్మును హేళన చేస్తున్నావు. నీవు రెట్టింపు అపరాధివి. మేము ఒక మతాన్ని ద్వేషించుట లేదు. క్రైస్తవ మతమును ద్వేషిస్తున్నామని ఎలాగు అనుకొనుచున్నావు?

89) ఓ సైతానా! 'బైబిలు మిషనును, ఎత్తి చూపించుమని' ప్రభువు చెప్పినప్పుడు, మేము బలహీనులమని ఆయనకు తెలియదా! ఆయనకు తెలుసును. మాకు క్రమముగా బలమిస్తాడు, లేకపోతే ఆ మాట మాకు చెప్పడు.

90) ఓ సాతానా! మా యొక్క బలహీనతలు చూచుటకు నీకు కండ్లున్నవి. కాని మా బలమును చూచుటకు నీకు కండ్లు లేవు. మాకు వస్తున్న మంచి, మంచి దర్శనాలు చూచుటకు, నీకు కండ్లు లేవు. నీవు ఓర్వలేక పోవుచున్నావు. ఆదాము, హవ్వలు పరిశుద్ధ స్థితిలోనున్నప్పుడు నీవు ఓర్వలేక పోయినావు. ఆ దుర్గుణము నీలోనుండి నేటివరకు పోలేదు.

91) ఓ సైతానా! 'బలహీనులు రాకడకెట్లు సిద్ధపడగలరని' నీవనుచున్నావు. మొదటి రాకడకు కొందరు సిద్ధపడలేదా? అలాగే రెండవ రాకడకు కూడ చాలమంది సిద్ధపడగలరు. పరిశుద్ధాత్మయే వారిని సిద్ధపరచును. నీవు సిద్ధపరచ లేవు గదా! ఆ పని నీకు చేత కాదు. నీవు పడగొట్టేవాడవు పడగొట్టుదువు గాని లేవనెత్తలేవు గదా!

(**చరణము:** *నేనిక సిద్ధంబుగా లేనని తెలిసినది నిరుకు = గానన్ పరిశుద్ధాత్మయే*

*నన్ను-కడకు సిద్ధము చేసికొనును*)

## 11. హేడెస్సు

92) ఓ సైతానా! నీవు చెడగొట్టిన అనేకమందిని మా ప్రభువు హేడెస్సులోనికి పంపినాడు. వారిని శిక్షించుటకు కాదుగాని, వారికి మారుమనస్సు కలిగించి మోక్షానికి తీసికొని వెళ్ళుటకే. అక్కడ ఆయన కైలాస ఋషిగారిని, సాధు సుందరసింగు గారిని, ఇంకను దేవదాసు అయ్యగారు మొదలైన వారిని పంపించి, బోధ చేయించుచున్నారని నీకు తెలియదా?

93) ఓ సైతానా! జలప్రళయ కాలములోను, యుద్ధకాలములోను, మారు మనస్సు పొందకుండ చనిపోయిన వారిని, ప్రభువు హేడెస్సులో ఉంచి పాఠములు చెప్పుచున్నారు గదా!

94) ఓ సాతానా! మా ప్రభువు రాకముందే మా ప్రభువును ఎరుగని మృతులు, నమ్మి పడిపోయిన మృతులు, ఎరిగి మారుమనస్సు పొందని మృతులు; వీరందరు నీ స్వాధీనములో లేరు. హేడెస్సులో మా ప్రభువు స్వాధీనములో నున్నారు. ఈ సంగతి నమ్మకుండా కొంతమందిని తయారు చేస్తున్నావు. నమ్మే వారిని మా ప్రభువు తయారుచేస్తే, వారిని ఆటంక పరుపగలిగినావా?

95) ఓ సైతానా! బరంపురములో ఐదుగురు స్త్రీలు గొప్ప కూటములు జరుపగా, డాక్టరు ఆట్మనమ్మనుబట్టి ఎన్నో మహిమగల సంగతులు మా ప్రభువు వ్రాయించినారు. అందొకటి హేడెస్సును గురించి. ఆమెను, ఆమె కూటమును, వారి పనిని ఆపుచేసినావా? వారు తమ పనిని ముగించుకొని, మా ప్రభువునొద్దకు వెళ్ళియున్నారు. వారు మా కూటమునకు వచ్చినారు కదా! మేము వారికి ఇష్టము లేకపోతే మా కూటమునకు ఎందుకు వస్తారు?

96) ఓ సాతానా! వారిని మాత్రమేకాక యం. దేవదాసు అయ్యగారిని కూడ మా కూటములకు ప్రభువు తీసికొని వస్తున్నారు. ఆయనను శుద్ధిచేయకపోతే, యేసుప్రభువునకు ఇష్టములేకపోతే ఎందుకు తీసికొని వస్తారు! నవీనకాలశుద్ధి, భావికాలశుద్ధియని రెండు రకముల శుద్ధులున్నవి. భావికాల శుద్ధినిబట్టియే, మా ప్రభువు తీసికొని వస్తున్నారు. భూలోక భక్తులను కూడ తీసికొని వచ్చుచున్నారు.

## 12. బైబిలు

97) ఓ సాతానా! బైబిలు 2000 భాషలలో అచ్చువేయబడి యున్నది. నీవు ఏ భాషలోని వారి దగ్గరకు వెళ్ళినను, అక్కడ ఆ భాషలో నీ కంటికి దేవుని వాక్యము కనబడును. అది నీకు బాణము. అయినప్పటికిని నీకు సిగ్గు, భయము లేదు. ఎందుకంటె నీవు మొండివాడవు.

98) ఓ సైతానా! రక్షణ వాగ్ధానములు బైబిలు నిండ ఉన్నవి. అవి మా తండ్రి పలుకకుండ నీవు ఆపుచేయగలిగినావా? ప్రవచనముగల పాత నిబంధన వ్రాయబడకుండ, ఓ సాతానా! పరిశుద్ధుల కలాలు ఆపివేయగల్గినావా?

99) ఓ సైతానా! యేసుప్రభువు పుట్టకుండా చేసినావా? నీవు అనేక పర్యాయములు ఆపుచేయుటకు ప్రయత్నించినావు. ఈ మాటలు బైబిలులో స్పష్టముగా వ్రాయబడలేదు గాని చరిత్రవల్ల మాకర్థమైనది.

100) ఓ సైతానా! నెరవేర్పుగల క్రొత్త నిబంధన వ్రాయబడకుండ, నీవు సువార్తికుల కలాలు ఆపివేయ గలిగినావా?

101) ఓ సాతానా! పూర్వకాలమందు రాజులు, తమకు తెలియకుండ బైబిలు చరిత్ర రాళ్ళమీద చెక్కించినారు. అవి ఇప్పుడు బైబిలంతటికి సాక్ష్యార్ధముగా నున్నవి. అవి చెక్కబడకుండ నీవు ఆపుచేయ గలిగినావా?

102) ఓ సాతానా! బైబిలుకంటె అనేక రెట్లు పెద్దవైన, సంఘచరిత్ర పుస్తకములు వ్రాయబడకుండ ఆపుచేయగల్గినావా?

103) ఓ సైతానా! బైబిలుయొక్క అర్ధములున్న వ్యాఖ్యాన గ్రంథములు లెక్కకు మించి ఉన్నవి. అవి వ్రాయబడకుండ పండితుల యొక్క జ్ఞాపకశక్తిని ఆపుచేయ గలిగినావా?

## 4. దయ్యములను వెళ్ళగొట్టే దైవప్రార్ధనాంశములు

104) యేసుప్రభువా! దయ్యములను వెళ్ళగొట్టుడని (మార్కు 16:17)లో తెలియపరచినావు, కనుక మేము అడుగుచున్నాము. బైబిలుమిషను మీదకు వచ్చిన దయ్యములను వెళ్ళగొట్టుము. అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవునని (యాకోబు 4:7)లో వ్రాయించినావు. సాతానును

మీ కాళ్ళక్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించెదనని వ్రాయించినావు (రోమా16:20). **అది ఇప్పుడే నెరవేర్చుము.** సన్నిధి కూటస్థులు నీ సెలవు అడిగి సైతానును, వాడి అనుచరులను, వాని దూతలను వెళ్ళగొట్టునట్లు ఏర్పరచుము.

105) మా దేవా! నీవు మనుష్యులను రక్షించినావు. దయ్యములలో ఒక దయ్యమునైనా రక్షించినావా! లేదు. దానినిబట్టి చూస్తే, దయ్యములు ఎంతగా చెడిపోయినవో మాకు తెలియుచున్నది. కాబట్టి సైతాను ఈ మాటలు వినేటట్లు చెప్పగల శక్తి దయచేయుము.

106) ప్రభువా! మార్కు సువార్త మొదటి అధ్యాయములో, నీవు దయ్యములను వెళ్ళగొట్టినావని వ్రాయబడియున్నది. అప్పుడు ఆ దయ్యము వెళ్ళిపోవుచు, ఆ రోగిని విలవిల లాడించినది. ఎందుచేత? నీవు వెళ్ళగొట్టేటప్పుడు ఆ మనిషిలో నుండుటకు వీలులేదు గనుక. ఉదా:- ఇద్దరు కుర్రవాళ్ళు వీధిలో పోట్లాడుకొనుచుండగా, ఒకడు రెండవ వానిని పడగొట్టి వెళ్ళిపోవుచున్నాడు. పడిపోయినవాడు, 'ఇంకొకసారి రమ్ము, ఏమిచేస్తానో చూడు'! అని అనెను. మొదటి కుర్రవాడు రెండవ కుర్రవానిని జయించినా, శక్తిలేనివాడే అనిపించుకొనును. ఎందుకనగా, అతడు ఇంకా అక్కడే ఉంటే, ఆ పడిపోయిన అబ్బాయి బంధువులు వచ్చి, ఆ కొట్టిన వానిని కొట్టుదురని వెళ్ళిపోవును. అదే శక్తిలేకపోవుట, సైతానుకు అటువంటి శక్తిలేనితనమే ఉన్నది. ప్రభువా! ఈ ఇద్దరి కుర్రవాళ్ళ సంగతి ఎత్తి, మేము సైతానును జయించుటకు కృప దయచేయుము.

107) ప్రభువా! 'దయ్యములు కూడ దేవునికి వణకుచున్నవని' యాకోబు వ్రాసినాడు (యాకోబు 2:19). దయ్యములు ఎందుకు వణకుచున్నవి? వాటికాలము రాకముందే, నీవు వాటిని నరకములో పడవేస్తావని అవి భయపడ్డవి. ఈ అంశము ఎత్తి మేము దయ్యములను ఎదిరించునట్లు జ్ఞానోదయము దయచేయుము.

108) దేవా! సృష్టి అంతటిచేత దయ్యములను త్రొక్కించుము. ఓ దేవా! యం.దేవదాసు అయ్యగారు రాత్రులు మంచముమీద ఉండి, ఒక అంశము మీద పత్రిక ఏలాగు వ్రాయవలెనో ఆలోచించిరి. ఆ వ్రాత అంతయు వరుసగా మనసులోనికి వచ్చినది. వ్రాయలేదు, అచ్చుపడలేదు. అయినప్పటికిని అది మనో పత్రికమీద ఉన్నది కదా! కనుక నీ దూతలను పంపి, భూతములన్నిటికి ఆ పత్రికను చూపించుము.

అప్పుడవి భయపడును. కాగితముమీద సంగతి వ్రాసినప్పుడవి రెండవసారి భయపడును. అది అచ్చువేసినప్పుడవి మూడవసారి భయపడును. మేము ప్రజలకు ఆ పత్రికను పంచిపెట్టగా, వారు చదువుకొన్నప్పుడు భూతములు మరియొకసారి భయపడును. ప్రజలు, ఆ అచ్చుకాగితమును బట్టి నడచుకొన్నప్పుడవి మరి ఎక్కువగా భయపడును. ఈ ప్రార్థన ఆలకించుము. ఆమేన్.

## 5. వాయు మండలములోని ప్రార్థన పుస్తకములు

**మొదటి ప్రార్థన**: యేసుప్రభువా! ఒక మనవి: ఈ ఎదిరింపులన్ని ఒక మహా పుస్తకములో వ్రాయించి, వాయుమండలములో (ఆత్మీయ) బల్లమీద పెట్టుము. ఆ పుస్తకమును ప్రతి నిమిషము భూతములన్నియు చూచుచుండును. అందువల్ల వాటియొక్క హృదయములో క్రొత్త భీతి ఏర్పడును. అందుచేత మా స్వాతంత్ర్యముతో,వాటి స్వాతంత్ర్యమును జయించుచున్నామని వాటికి తెలియును.

**రెండవ ప్రార్థన:** ఓ తండ్రీ! మేము మాకు తోచిన ఎదిరింపులు వ్రాసినాము. గాని సహకారులైన దేవదూతలు, మోక్షలోక వాస్తవ్యులు, భూలోక విశ్వాసులు, ఇతర సన్నిధి కూటస్థులచేత కూడ ఇట్టివి అనగా మా పుస్తకములో లేనివి, క్రొత్తవి వ్రాయించి, ఈ రెండవ పుస్తకము కూడ వాయుమండలములో మరియొక (ఆత్మీయ) బల్లమీద పెట్టించుము. సాతానుకు భయము రెట్టింపగును, భూమి మీద మా జయము రెట్టింపగును.

**మూడవ ప్రార్థన:** తండ్రీ! మరియొక మనవి. లోకములో మిగిలిపోయిన పాపాత్ములు, అవిశ్వాసులు ఉన్నారు. వారియొద్దకు నీవు ఎవరినైన పంపించిన యెడల, ఆయన వారినిట్లు అడుగును. 'సాతాను మిమ్మును ఎన్ని పర్యాయములు బాధించినాడు?' ఇట్లు అడిగి ఆ సేవకుడు, తన రిపోర్టును ఒక పుస్తకముగా వ్రాయును. అవిశ్వాసులు చెప్పరుగాని, ఆ సేవకుడు ఒక జవాను (సేవకుని)వలె వెళ్ళి కూపీ (రహస్యము) తీసి, ఆ పుస్తకమును తయారుచేసి నీకప్పగించును. ఈ పుస్తకము కూడ వాయుమండలములో ఒక ఆత్మీయ బల్లమీద పెట్టించుము.

**నాల్గవ ప్రార్థన:** ప్రభువా! మరియొక మనవి: పరిత్యాగ పత్రిక ఒక పుస్తకముగా వ్రాసి, మరియొక బల్లమీద పెట్టించుము. పరిత్యాగ పత్రిక అంటే దయ్యములకు బాధ, గోల.

**ఐదవ ప్రార్థన:** ప్రభువా! ఈ సైతాను నెదిరించు విషయములను గురించి దైవసన్నిధి కూటములలో ఇట్లనుచున్నారు. "ఆయన (యం. దేవదాసు అయ్యగారు) వలె ఎవ్వరును లేరు గనుక ఈ ఎదిరింపులు మరియెవరును చెప్పలేరు. గనుక ఆయనను, సైతాను పడవేసినది (అనగా శ్రమలు). అయినను ఆయన జబ్బుతో మంచముమీద ఉన్నను, అనారోగ్యముతో వాలు కుర్చీపై ఉన్నను ఈ నోట్సు చెప్పలేదా? 'నా పంతము నెరవేరినదా, వాడి (సైతాను) పంతము నెరవేరినదా!' అని ఆయన అన్నారు". యేసుప్రభువా! ఇదియును వాయు మండలములోనికి వెళ్ళవలయునని ప్రార్థించుచున్నాము.

**ఆరవ ప్రార్థన:** ఓ దేవా! మీరు కలుగజేసిన యావత్తు సృష్టియొద్దకు (మూల్గుచున్న సృష్టి, రోమా 8వ అధ్యాయము) ఎవరినైనా పంపించుము. అప్పుడు సృష్టిని చూచి, సృష్టిలోనున్న ప్రతిజీవిని చూచి ఆ పరలోక జవాను, 'సైతాను వలన నీకు ఏమి కష్టము కలిగినదో చెప్పుమని' అడుగవలెను. ఈ రిపోర్టును కూడ వాయు మండలములో, వేరొకబల్ల మీద పెట్టించవలయునని ప్రార్థించుచున్నాము.

**ఏడవ ప్రార్థన:** ప్రభువా! మరియొక మనవి: ఓ ప్రభువా! 'యం. దేవదాసు అయ్యగారి మనసులో అనేక క్రొత్త సంగతులున్నవని' చెప్పియున్నారు. అవి కొన్ని మాత్రమే ఈ 62 ఏండ్లలో బయటికి వచ్చినవి. ఇంకా ఉన్నవి, అవి వ్రాయబడలేదు. ఏ దూతచేతనైనా వాటిని వ్రాయించి, వాయు మండలములో ఆ పుస్తకమును, ఏడవ బల్లమీద పెట్టించుమని ప్రార్థించుచున్నాము.

## 6. పరిత్యాగ పత్రిక

ఓ సాతానా! నీవంటే మాకు ఇష్టములేదు. గనుక నీకు పరిత్యాగపత్రిక ఇస్తున్నాము. **ఇది రాకడ వరకు చెల్లును.** ఆ తరువాత మేము నీకు కనబడనే కనబడము. మా పరిత్యాగ పత్రిక శాశ్వతము వరకు పనిచేస్తుంది.

### పరిత్యాగ పత్రిక కీర్తన వచనము

పోపొమ్ము ఓ లోకమా! చాలిక చాలు– నీ పొందు మేమొల్లము = పోపొమ్ము ఓ సాతానా! చాలిక చాలు – నీ పొందు మేమొల్లము.

**'ఓ సాతానా!'** అనుమాటకు బదులుగా, ఈ క్రింది పదములు ఉపయోగించి పాడవలెను.

ఓ పాపమా, ఓ పాప ఫలితమా, ఓ దయ్యమా, ఓ భూతమా, ఓ రోగమా, ఓ దుఃఖమా, ఓ శాపమా, ఓ లోపమా, ఓ శోధనా, ఓ మందమా, ఓ కంపమా, ఓ దుర్దశా, ఓ పాప నైజమా, ఓ మరణమా, ఓ నరకమా, ఓ హేడెస్సా.

## 7. సంగ్రహ వాక్యావళి

ఓ సాతానా! నీవు నాలో పుట్టించిన చెడుగు నీకే రవాణా. నీ ఆలోచనలు, నీ ప్రయత్నములు ఇదివరకే మేము దుంప నాశనము చేసియున్నాము. నీ ఆర్భాటములు, నీవు మా మీద మోపే నిందలు అర్థము లేనివి. ఎందుకనగా మా తండ్రియొక్క అమూల్యమైన రక్తము, మమ్మును మా క్షమాపణ ప్రార్థనలనుబట్టి శుద్ధీకరించెను. గత కాలములో నీవు పాపములో పడవేసిన మనుష్యులు ఏరి? నీ దగ్గర ఉండవలసినదే గదా! కన్నెత్తి చూడు, మోక్షములో నున్నారు!

## 8. నరహస్త ఖడ్గ ప్రార్థన

ఓ సాతానా! నీవు ఎంతమంది యొక్క పాపములకు, శ్రమలకు, మరణమునకు, హేడెస్సుకు, నరకమునకు కారకుడవైనావో జ్ఞాపకము తెచ్చుకో. అన్ని శిక్షలు నీకున్నవి.

1) జలప్రళయ మరణములో నీవు పాపము చేయించగా, పాపము చేసిన నరులకే శిక్షలు. అయితే, నీకో! పాపములను, శ్రమలను, ఇతరావస్థలను, శిక్షలను నరులు అనుభవిస్తున్నారు. నీకు కూడ ఇవి తప్పవు. వీటి సంఖ్య లెక్కకు మించి పోయినది. ఆలాగే నీ శిక్షలు కూడ లెక్కకు మించి, దేవుని గణిత శాస్త్రములో నున్నవి. 2) సొదొమ, గొమొఱ్ఱా పట్టణముల నాశనము, 3) ఐగుప్తులో ప్రథమ పుత్రుని మరణము, 4) ఎర్ర సముద్రములో నాశనమైన ప్రజలు, 5) అరణ్యములో నలుబది ఏండ్లలో మృతులైనవారు, 6) యెహోషువ, మోయాబీయులను నాశనము చేయుట, 7) అమ్మోనీయుల నాశనము, 8) ఎదోమీయుల నాశనము, 9) యెహోషువ కాలములో ఏడు జనాంగముల నాశనము, 10) న్యాయాధి-పతుల కాలములో నాశనమైనవారు, 11) దావీదు కాలములో నాశనమైనవారు, 12) సంసోను కాలములో నాశనమైనవారు, 13) గిద్యోను కాలములో నాశనమైన వారు, 14) హాయి పట్టణకాలములో నాశనమైనవారు, 15) జర్మనీ యుద్ధములో (మొదటి ప్రపంచ యుద్ధములో) నాశనమైనవారు, 16) రెండవ ప్రపంచ యుద్ధములో

నాశనమైనవారు, 17) రాకడ వరకు ఎంతమంది హతులౌదురో (ఆ విషయము), 18) ఏడేండ్ల శ్రమకాలములో ఎంతమంది హతులౌదురో (ఆ సంగతి), 19) వెయ్యేండ్లలో ఎందరు హతులగుదురో వారు.

దేవా! ఈ 19 మాత్రమే కాదు. మా గణిత శాస్త్రమునకు అందనివి అనేకములు గలవు. అన్ని శిక్షలు సాతానుకు, అతనికి సంబంధించిన దురాత్మలకు రానిమ్ము. గాని నీవు కలుగజేసిన మానవులు ఎంత దుష్టులైనప్పటికిని; నీ సర్వశక్తికి, నీ సర్వ జ్ఞానమునకు అందే సాధనములు ఉపయోగించి రక్షించుము. వారు నీ సృష్టి మరియు సకల జనులకు సువార్త ప్రకటించుమని మాకెవరిని గురించి చెప్పినావో, వారు మనుష్య జాతినిబట్టి మా వారే. ఈ మా కల్పన ప్రార్ధనలో, నీ ఇష్టము లేని ప్రార్ధనల విషయములో మమ్మును క్షమించుము. ఇది నీ కుమారుని ముఖబింబమును చూచి ఆలకించుము. ఆమేన్.

## 9. ముగింపు ప్రార్ధన

మహోన్నతుడవైన తండ్రీ! నీవు మహిమలో మహిమస్వరూపుడవు. జ్ఞానములో జ్ఞానస్వరూపుడవు, శక్తిలో శక్తిస్వరూపుడవు, న్యాయములో న్యాయ స్వరూపడవు. కాబట్టి నీకనేక స్తోత్రములు. నీవు సమస్తములో సమస్తమై యున్నావు. అన్నింటిలో నీవున్నావు. నీవు లేకుండా ఏమియు జరుగదు. మేము లేకుండా కూడా ఏమియు జరుగదు. ఇట్టి ఆశ్చర్యము ఆదికాలమునుండి చేయాలని తలంచుకొన్నావు. నీవు నా స్థలము ఏర్పరచుకొనిన స్థలజ్ఞానివై యున్నావు. ఇట్టి తలంపులు మాకు అనుగ్రహించి సాతానును పడవేయుటకు, దానిని ఎదిరించుటకు శక్తి దయచేసినావు. నీకు వందనములు. ఇవి వింటే సాతానుకు, వాని దూతలకు పులకర జ్వరము తగులుతుంది.

తండ్రీ! ఈ దినము జపాను దేశమును గూర్చి ప్రార్ధించినాము గదా! రేపు చైనా తరువాత బర్మా, సైయాం ఇండియా, పాలస్తీనా, టిబెట్టు... ఈలాగు అన్ని దేశములను గురించి, అదే ప్రార్ధన కొద్ది మార్పులతో చేయుదుము. గాని, ఒక్కొక్క దానిలో కొద్దికొద్దిగా మార్పులుండ వచ్చును. ఈ ప్రార్ధనలన్ని సాతానును ఎదిరించేవి కావు గాని, సాతాను దృష్టిలో ఎదిరించేవే. ఈ ప్రార్ధనలు సాతానుకు ఇష్టము లేదు. ఎందుకంటే, శత్రు దేశస్థులు క్రిందటి యుద్ధములో, అనేకమందిని

చంపిరి. వారు దుర్మార్గులైననూ, వారిని నాశనము చేయుమని మేము ప్రార్థించము. వారు పాతాళములో నున్నను, వారిని క్షమించుమని ప్రార్థించిన యెడల, అది సాతానును ఎదిరించే ప్రార్థనయే. సృష్టిని కాపాడుమని ప్రార్థించుట, సాతానును ఎదిరించుటే. ఈ ప్రార్థన చేయుటకే మేము పుట్టినాము. మేము పాపులమైతే మాత్రము, ఎప్పుడో ఒకప్పుడు ప్రభువు శుద్ధిచేస్తాడు. ప్రభువా! మీరు లేకుండా మేము, మేము లేకుండా మీరు ఉండుట అసాధ్యము. నీవు ఉన్నావు గనుక మాకు జయము. *ఎందుకనగా పాపములో నీ తలంపే కలిగియున్నాము. గనుక నేను పాపములో పడినను, అపజయము లేదు. (పాపములో పడినట్లే గనుక) నేను జయము పొందినట్లే. ఎందుకంటే,* నీవు నేను *ఒకటే. గనుక* సాతానును ఎదిరించే ప్రార్థన చేసిన దానికి అపజయమే. నీవు నేను ఒకటే గనుక ఇంకొక మాట. ఈ వేళ మేము ఇంకొకమారు సాతానును ఎదిరించి ప్రార్థన చేస్తాము. సాతాను రాజ్యము దుంపనాశనము. అవే ఎదిరింపులు చేస్తుండగా భక్తుల సమూహము, బైబిలు బోధలు వృద్ధే. ఇక్కడ మేము సాతానును ఎదిరిస్తే నీ రాజ్యము పైకి రావడము, రక్షితుల వృద్ధి, సువార్త వృద్ధి మరియు సమస్త జనుల వృద్ధి. మా చూపు ఇక్కడ, అక్కడ కూడ ఉన్నది. మేము అందరి క్షేమము కోరుచుండగా, వానికి సిగ్గు మరియు వాని రాజ్యము కూలిపోతుంది. నీ రాజ్యము వృద్ధియగుచున్నది. సాతాను అది చూచుట లేదు ఇది చూచుట లేదు. ఇక దానికేమి గతియున్నది.

అవును ప్రభువా! నీవు రాకపోతే పుట్టగతులు లేవు. నీవు పాత నిబంధనలో పుట్టలేదు, క్రొత్త నిబంధనలో పుట్టినావు. క్రొత్త నిబంధనలో ఆది సంఘ కాలములో మేము పుట్టలేదు. ఈ కాలములో పుట్టిన మేము, నీవు ఏకమైయున్నాము. గనుక మేము నిద్రపోకూడదు. మేము మేల్కొని సేవ చేస్తున్నాము, చేస్తాము. ఇక్కడ చేయకపోతే రేపు ఎక్కడైనా పూర్తి చేస్తాము. సంఘము పరలోకములోనికి వెళ్ళిన తరువాత కూడ చేస్తాము. చెడ్డకలలు వచ్చినా మేము ఆ సమయములోనే, మంచికలలు గలవారమై యున్నాము. గ్రుడ్డివారమైనను, చూపుగలవారమై యున్నాము. ఎందుకనగా, నీవు మేము ఒకటేనని పౌలు వ్రాసినాడు. అబ్రాహాము, మేము విశ్వాసులకు తండ్రులమే. అబ్రాహాము మనిషే. అబ్రాహామునకు ఉన్నది

మాకును ఉన్నది, ఉన్నట్లే. సాతాను మా బైబిలు చింపినా, మా బట్టలు చింపినా, మా బట్టలు మాకే యున్నవి, మా బైబిలు మాకే యున్నది, మా సంఘము మాకే యున్నది. తండ్రీ, నీకు స్తోత్రములు. సాతానుయొక్క దుర్బుద్ధి కనబడుచున్నది. మేము రాజ్యమేలుచున్నాము. రాజులమే, లేవీయులమే, యాజకులమే, పరిశుద్ధులమే. ఇట్టివారమైయుండగా పిశాచి కాదన్నను చెల్లదు. సమయము అయిపోయినదని పిశాచి చెలరేగినాడు. అయితే అన్ని సమయములు, గడియలు మాకే. మా తండ్రివి నిమిషములన్నియు మాకే. గదిలోని వారందరు చెడ్డవారని సాతాను అంటే మాకేమి? దాని చెడ్డనోరు కల్పించినది కాని మాకేమి? దాని దుండగతనము తీర్పులో కన్పించును. ఎలాగనగా దొంగవానిని శిక్షించునప్పుడు, వాని దొంగతనమంతయు కన్పించును. సాతానా! మా మంచి కార్యములన్నియు, దేవదూతలు మా కుడి ప్రక్కన ఉండి వ్రాస్తారు. ఎడమ ప్రక్కన ఉన్నవారు, మా రికార్డు అంతయు వ్రాయుట మాని నిదానిస్తూ యుంటారు. దేవదూతలు మా తోబుట్టువులే, మా అన్నదమ్ములే, మా అక్కచెల్లెండ్రే, వారు మా వారే. సాతానా! నీవు ఇంకను దుండగతనము చేస్తున్నావు. నీకు నాశనమని తెలిసినను మానవు. మా తండ్రి మా అడ్డములను, మా బలహీనతలను, మా పాపాలను పడగొట్టి వేసినాడు. తండ్రీ! ఇక్కడ 'బూటకపు బోధకులు కొందరు అక్రమకారులై, నరకాగ్నికి వెళ్ళుదురని' మత్తయిలో వ్రాయబడియున్నది. ఇది ఒక్కటే మాకు అర్థము కావటము లేదు, కాని నీకు అర్థమగుచున్నది. అందరిని క్షమించుము, అందరిని రక్షించుము. 'నరకములోనికి వెళ్ళనీయవద్దని' ప్రార్థించుట తప్పే. ఎందుకంటే కొందరు వెళ్ళుదురని బైబిలులో వ్రాయబడియున్నది. అయితే నాది కూడా ఒప్పు అయియున్నది. ఎందుకంటె, హేడెస్సులో అనేకులు మారుచున్నారు. నీ వాక్యము నెరవేరుతుంది, నా మాట నెరవేరదు. ప్రభువా! మేము ఒక్కటే పట్టుకొన్నాము. *'నరులారా! నరకము మీది కాదు'* అని వ్రాయించినావు. అదే నేను పట్టుకొన్నాను. అలాగు ప్రార్థించుట తప్పేగాని, 'అడుగుడి మీకిస్తానన్నావు' గనుక అడుగుచున్నాము. యేసుప్రభువా! ఎక్కడనో మహిమ లోకములోనున్న నీవు, పాప లోకములోనికి శిశువుగా వచ్చినావు గనుక చనువైపోయినావు, గనుక

అడుగుచున్నాము. ఎమ్మాయికి వెళ్ళినవారితో, నీవు వెళ్ళినావు. వారు నీతోను, నీవు వారితోను నడచినట్లు; నీవు మాతోను, మేము నీతోను ఉన్నాము, నడుస్తున్నాము. *ఓ సాతానా! నేను నరకాగ్ని గుమ్మమువరకు వెళ్ళినా, అక్కడ నున్న గొర్రెపిల్లను భుజముమీద వేసికొన్నట్లు, నన్ను భుజముమీద వేసికొని, నా ప్రభువు తన సింహాసనముమీద కూర్చుండ బెట్టును. నీ కేమి యున్నది? ఓ సాతానా!*

'ఎట్టివారినైన-ఏస్థలమునందైన పట్టి రక్షించుటకై = పాట్లొందు తండ్రికి మంగళార్చ' (మంగళ స్తోత్రా). దేవదాసు అయ్యగారు -టైం (సమయము) అయ్యిందని అనగా కొందరు ఆకలివల్ల గడియారము తట్టు చూచుచున్నారు. ఆకలివల్ల కొందరు బిడ్డలు అలసియున్నారు. అయితే మాత్రము ప్రభువా! కాలము నీ చేతిలో నున్నది. నేను ఏర్పాటు బిడ్డను. నీ కుమారుడను గనుక అడుగు చున్నాను. నన్ను కొడతావా! కొట్టవు. ఇట్టి ప్రార్థన చేయుటకే మంచముమీద లేవకుండా పండుకొన్నాను. అక్షయ *దేహము దాల్చితివీవు......లక్ష్యము పెట్టకుమీ!*

భయపడకండి (ఏనుగు చచ్చినా వెయ్యే, బ్రతికినా వెయ్యే). త్రియేక దేవుడవైన ఓ ప్రభువా! నీకనేక వందనములు. నీవు మా తండ్రివి. మేమెన్నిసార్లు పడినా, నిన్నెన్ని అడిగినా నీవు కోపపడవు. పరమ భక్తులైనవారు పడిపోతే, నీవు కోపపడ లేదు గనుక త్రియేక దేవా! నీకు స్తోత్రము. 'త్వరగా వస్తున్నానని చెప్పుచున్నావు, త్వరగా సిద్ధపడండని' చెప్పుచున్నావు. త్వరగా సిద్ధపడే కృప కొరకు, మా గలిలయ యేసుప్రభువా! నీ నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్. మరనాత

# అనుబంధము

## I. సైతాను నెదిరించు సూత్రములు

1) ప్రార్థనలు, 2) దైవస్తుతులు, 3) ఎదిరింపులు, 4) కీర్తనలు, 5) గమనికలు.

### 1. ప్రార్థనలు

ఎ) దేవా! సాతానును, అతని అనుచరులను, అతని దూతలను నిలువబెట్టి, 'మీకు నేను ఏ మేలు చేయలేదా!' అని అడుగుము.

బి) దేవా! యుద్ధ భటులవలె మేము ప్రతిదినము, సాతానును ఎదిరించేటట్లు మాకు తెగింపు అనుగ్రహించుము.

సి) దేవా! సాతాను ఎన్నిమాయలైన చేయునుగాని, అతని తంత్రోపాయములను మేము ఎరుగనివారము కాము అనియు, శరీర నేత్రములకు కనబడని యుద్ధోపకరణములు, మా ప్రభువు ఇచ్చినవి మాయొద్దనే ఉన్నవనియు తలంచుకొని, ఆత్మీయ యుద్ధము సాగించుకొనేటట్లు ముందడుగు వేయు కృప దయచేయుము.

డి) ఓ దేవా! 'సాతానును, అతని సైన్యములును క్రీస్తుప్రభువు వలన ఓడింపబడినవారు' గనుక వారు మమ్ములను ఏమి చేయగలరు! అని మేము అనుకొని, ప్రభువుయొక్క విజయ బలముమీద ఆనుకొని, వాటిని మా పాదముల క్రిందవేసి త్రొక్కేటట్టు మాకు శౌర్యము దయచేయుము.

ఇ) ఓ దేవా! మేము సాతానును 'ఎదిరించే కొలది', అతడు చెలరేగునని మాకు తెలియును. అయినను అతని బెదిరింపులు, మేము చేసే ఎదిరింపుల ఎదుట ఏ మూల? అని నమ్మి, అతడు చెలరేగిన దానికంటె మేము ఎక్కువ చెలరేగుటకు మాకు పౌరుషము దయచేయుము.

ఎఫ్) ప్రభువా! ఈ సమయములో నీవు మా దగ్గర ఉంటే, బైబిలులో వానికి విరోధముగా ఎన్ని వాక్యములు ఉన్నవో, ఎన్ని కథలు ఉన్నవో, అవన్నియు వానిమీద పడేటట్లు విసరివేయుము. ఈ విధముగా మాకు యుద్ధములో సహాయము చేయుము.

జి) మా ప్రభువా! ఎఫెసీ. 6వ అధ్యాయములో వ్రాయబడిన ఆయుధములు అన్నియు మాకు ధరింపజేసి, ఈ యుద్ధములో ఆకాశమువరకు వెళ్ళి ఎగిరే జెండాను మాకు దయచేయుము.

హెచ్) యేసుప్రభువా! నీవు సిలువ మ్రానుమీద ఉండి, సాతాను అనే ఘట సర్పముయొక్క తలను చితక గొట్టినావు. అయినను వాడు తోకను ఆడించినను, మేము భయపడకుండునట్లు మాకు నిర్భయ హృదయము దయచేయుము.

ఐ) క్రీస్తుప్రభువా! 'ఎప్పటికైనను సాతానుకు, వాని దూతలకు, అనుచరులకు, నరకాగ్ని తప్పదు' అని వ్రాయబడిన వాక్యము, వారికి నోటీసు బల్ల దగ్గర కనబడేటట్లు చేయుము. ఈ ప్రకారముగా వాడిని యుద్ధములో నిరుత్సాహ పరచుము.

జె) యేసుప్రభువా! 'మమ్మును శోధించుటకు వానికి సెలవున్నదని', సైతాను అనుచున్నాడు. లోకములో ఉండే మనుష్యులందరు నీకు అర్జీ పెట్టుకుంటే, ఒక్క నిమిషములో నీవు వానిని బంధిస్తావు, గాని అందరూ సమకూడరు గనుక వారి ప్రతినిధులుగా మేము వేడుకొనుచున్నాము.

*"దేవా! సాతానుయొక్క స్వాతంత్ర్యమును తీసివేయుము. మా పక్షముగా సాతానును బంధించివేయుము".*

కె) దేవా! ఆరు వేల సంవత్సరములనుండి సాతాను ఎంతమందిని పడవేసినాడో, ఎంతమందితో పాపము చేయించి చంపించినాడో, ఎంతమంది భక్తులను హతము చేసెనో; ఈ మూడు గుంపులను నీ పాదముల దగ్గర పెట్టుచు అడుగుచున్నాము.

యల్) ప్రభువా! చీకటి అనేది పిశాచి పని. దానివలన మాకు ఏ కీడును కలుగ నీయకుము. ప్రభువా! సాతానునుబట్టి సమయమునుగాని, వస్తువులను గాని, వ్యర్థము చేసికొనకుండ మమ్మును కాపాడుము.

## 2. దైవస్తుతి

పరిశోధనకు ఈ క్రింది దైవస్తుతి చెప్పితే, సాతాను సహించలేక పారిపోవును. ***"ప్రభుయేసు రక్తమునకు సంపూర్ణ జయము, అపవాది క్రియలకు సర్వనాశనము"*** అనిన వాడు అడుగునకు పోవును. ప్రభుయేసు రక్తము అంటే సాతాను సహించలేక పారిపోవును.

## 3. ఎదిరింపులు

1) ఓ సాతానా! మానవుడు పాపము చేస్తే, అతడు మారుమనస్సు పొందుటకు గడువున్నది. అయితే చివర మాత్రము తీర్పు ఉన్నది గాని నీకైతే ఇప్పుడే తీర్పు. (Man will be condemned on the last day; but you are condemned already!)

2) ఓ సాతానా! పాపము నీవల్లనే వచ్చినది. వెయ్యేండ్ల పరిపాలనలో పిశాచి, దయ్యములు, పాపములు ఉండవుగాని నైజపాపము మాత్రము ఉంటుంది. ఆ *నైజపాపము గొప్ప అంతస్తునకు రానీయదు గనుక దానిని ఇప్పుడే తొలగించుకొనవలెను.*

3) ఓ సాతానా! నీవు మమ్ము‌ను రోజు బాధిస్తున్నావు. గనుక ఈ సూత్రములు ఎత్తి నిన్ను, మేము రోజూ సాధిస్తాము. ఈ సూత్రముల ద్వారా నిన్ను ఎదిరించి భయపెట్టుచున్నాము.

## 4. కీర్తనలు

1. సాతానుగాని, దానియొక్క సైన్యముగాని కనబడితే, భయపడినప్పుడు

ఎ) 'ఉన్నపాటున వచ్చుచున్నాను.... నన్ను దయగను' అనుచరణము పాడవలెను.

బి) 'నీ వాగ్దత్తము నమ్మి– నీపై భారముపెట్టి జీవమార్గము గంటిని' అను చరణము పాడవలెను.

2. చీకటి కనిపిస్తే: 'దరిలేని యానంద – కరమైన నీ ప్రేమ – తరమే వర్ణన చేయను!' అను చరణము పాడవలెను.

## 5. గమనికలు

1) జయించే పనిమీద సాతాను పేరు ఎత్తవచ్చును. జయించినప్పుడే ప్రభువు, 'సాతానా! *నా వెనుకకు పొమ్ము!*' అని అనెను.

2) రెండు సిలువలు: 1) మనము మన పాపములను, 'ప్రభువుమీద వేయుట' ఎందుకనగా, అవి పరిహరింపబడి, మనమీద లేకుండా చేసికొనుటకే, 2) మన *పాపములు 'సాతానుమీద వేయుట' ఎందుకనగా, వానిమీద అవి ఉండుటకే.*

3) పాపపు తలంపులు వస్తే, 'అవి నావి కావు, సాతాను తెచ్చి అంటించినవి' అని అనుకొని, మనము 'ఓ సాతానా! ఈ పాపపు తలంపులు నావి కావు. నీవే గనుక నీ ముఖముమీద వేసి కొట్టుచున్నాను' **అని అనవలెను.**

## 6. సైతానును లొంగదీయుట

ఎ) స్తుతి కీర్తనలు, బి) వాక్యపఠన, సి) పై రెండింటికిని లొంగకపోతే ప్రార్థనలు చేయవలెను. డి) ఇంకను సైతానును జయించలేకపోతే, మరియొకరిని పిలిచి వారితో ప్రార్థన చేయించవలెను. మరియు ప్రకటనలోని స్తుతి వచనములు చదువవలెను.

## 7. సైతానును ఎదిరించుటకు ముఖ్య సూత్రములు:

1) 'అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును' యాకోబు 4:7.

2) 'సాతానును మీ కాళ్ళక్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును'. రోమా 16:20.

3) 'నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు' మార్కు 16:17.

4) 'అపవాదియొక్క క్రియలను లయపర్చుటకే, దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను' I యోహాను 3:8.

5) 'ప్రభుయేసు రక్తమునకు జయము, అపవాది క్రియలకు లయము' ఇది వాక్యాధారము.

6) గేటువద్ద దేవదూతల-ఘాటు ఉన్నది అది దాటి దయ్యాల గుంపు రాకున్నది, రాలేకున్నది- కావలిగల విశ్వాసీ! కలత పడకుమీ- కావలిగల విశ్వాసీ! కలత పడకుమీ - కావలిగల విశ్వాసీ! కలత పడకుమీ, మదిని కలత పడకుమీ!

**దయ్యముల గుంపునకు బదులు:** 1) చోరుల గుంపు, 2) హంతకుల గుంపు, 3) మృగాల గుంపు, 4) పైనుండి పిడుగు, 5) ప్రవాహంబు, 6) భూకంపాళి, 7) హాని ఏమియు, 8) పాపమేమైన, 9) పగవారి గుంపు, 10) విషజీవుల గుంపు అని పాడుకొన వలయును. పై ఎదిరింపులు ఎదిరిస్తే మీరు ఏమియు భయపడనక్కరలేదు.

7) యేసు నామమున విజయము: *(1)* మార్కు 5:1-20, *(2)* 1యోహాను 3:8, *(3)* సిలువనుగూర్చి పాడవలెను, *(4)* యాకోబు 4:7, *(5)* సిలువ ధ్యానము చేయవలెను, *(6)* బోధకుడు వాక్యము చదువుచు, దయ్యము పట్టిన వానిచే ఏడుసార్లు చెప్పించవలెను, *(7)* యెషయా 6వ అధ్యాయము బోధకుడు 7సార్లు చదువవలెను. దయ్యముబట్టిన వానితో, ఏడుసార్లు తిరిగి చెప్పించవలెను, *(8)* ప్రకటన 4:8; 3వ పంక్తినుండి చదువవలెను. ఏడుమార్లు తిరిగి చెప్పించవలెను.

## 8. సాతానును ఎదిరించు రిఫరెన్సులు

**1) హేడెస్సు:** కీర్తన 55:15; 139:8, 15; 116:3; సామెతలు 15:11; 27:20; యెషయా 5:14; యెషయా 33:14; 14:9; 28:15; యెహెజ్కేలు

31:16; ఆమోసు 9:2; యోనా 2:2; హెబ్రీ 2:15; మత్తయి 5:22; లూకా 10:15; 16:23; 6:24; మత్తయి 3:12; ఫిలిప్పీ 2:9; 1 సమూయేలు 2:6.

**2) పిశాచి:** Iపేతురు 5:8; మత్తయి 12:24; ఎఫెసీ 2:2; యోహాను 14:30.

**3) గర్వము:** యోబు 1:9; 2:4; I తిమోతి 3:6; ఎఫెసీ 2:2; 6:12; లూకా 8:29; 9:39-42; Iపేతురు 5:8.

**4) నిత్యనరకాగ్ని:** మత్తయి 25:41.

**5) న్యాయపుతీర్పు**: యూదా 6వ వచనము; ప్రకటన 20:10; కీర్తన 91:3; మత్తయి 13:25,28; I పేతురు 5:8; ప్రకటన 12:9; 20:2.

**6) సైతాను సృష్టి:** నిర్గమ 32:1; మత్తయి 5:34; లేవీ 19:12; ద్వితీ. 18:10; II తిమోతి 3:2-5; మత్తయి 15:19; ప్రసంగి 5:1; సామెతలు 30:17; నిర్గమ 21:15; మత్తయి 5:21; ఎఫెసీ 4:31; నిర్గమ 20:13-17; మత్తయి 5:28; గలతీ 5:19-21; I తిమోతి 6:10; నిర్గమ 21:12; 21:13; ఎఫెసీ 4:25; సామెతలు 11:13; నిర్గమ 23:1; 20:7; సామెతలు 26:28; కీర్తనలు 53:1; మత్తయి 13:15.

**7) అగాధము:** ఆది 1:2;7:11; కీర్తన 33:7; 69:2-15; 86:13; సామెతలు 3:20;15:11; పరమగీతము. 8:7; యెషయా 51:10; యెహెజ్కేలు 32:23; లూకా 16:26.

**8) అపవాది:** యోబు 1:6; రోమా 1:30; II తిమోతి 3:3; ప్రకటన 12:9-11; 20:2-10.

**9) అపవిత్రాత్మ:** మత్తయి 10:1; 12:43; మార్కు 1:23; లూకా 11:24; అపో.కార్య. 8:7.

**10) అబద్ధ ప్రవక్తలు:** ద్వితీ. 13:1-3; 18:20; I రాజులు 13:18; 22:23; యెషయా 56:10; యిర్మీయా 6:13; 14:13-17; 23వ అధ్యాయము. యెహెజ్కేలు 22:28; 34:2-10; లూకా 6:26; మలాకీ 1:6; IIపేతురు 2:1.

## 9.సాతానును గురించిన వాక్యములు

| | | | |
|---|---|---|---|
| ఆది | 3:1 | - | పాము వలె మొదటి నరులను మోసగించెను. |
| | 3:4 | - | హవ్వతో అబద్ధమాడెను. |
| | 3:14 | - | శాపము పొందెను. |
| ద్వితీ. | 6:13<br>6:16<br>8:3 | } | క్రీస్తుప్రభువు వనవాస సమయమున సాతానును జయించుటకు వాడిన వాక్యములు. |
| కీర్తన | 91:11-13 | - | కొదమసింహములను.....అణగద్రొక్కుట. |
| Iదిన. | 21:1 | - | సాతాను దావీదును ప్రేరేపించెను. |
| యోబు | 1:6; 2:1 | - | సాతాను దేవుని దగ్గరకు వచ్చుట. |
| యోబు | 2:7 | - | సాతాను యోబును మొత్తుట. |
| కీర్తన | 109:6 | - | అపవాది. |
| సామెతలు | 28:1 | - | దుష్టుడు. |
| యెషయా | 14:12-15 | - | సాతాను పతనము. |
| జెకర్యా | 3:1 | - | సాతాను ఫిర్యాదిగా నిలువబడుట. |
| జెకర్యా | 3:2 | - | యెహోవా నిన్ను గద్దించును. |
| మత్తయి | 4:10 | - | 'సాతానా! పొమ్ము' అని ప్రభువు అనుట. |
| మత్తయి | 13:19 | - | సాతాను వాక్యము ఎత్తికొని పోవును. |
| మత్తయి | 16:23 | - | 'సాతానా! నా వెనుకకు పొమ్ము.' |
| మత్తయి | 25:41 | - | సాతానుకు నిత్యాగ్ని ఏర్పాటు. |
| మత్తయి<br>మార్కు<br>లూకా | 4:3-11<br>1:13;<br>4:1-13. | } - | సాతాను ప్రభువును శోధించుట |
| మార్కు | 8:33 | - | 'సాతానా! నా వెనుకకు పొమ్ము.' |
| లూకా | 10:18 | - | సాతాను మెరుపువలె పడుట. |
| లూకా | 10:19 | - | శత్రువు బలమంతటిమీద అధికారము. |

లూకా 22:3

యోహాను 13:2 – ఇస్కరియోతు యూదాలో సాతాను ప్రవేశించుట.

లూకా 22:31 – శిష్యులను జల్లించుటకు కోరుకొనెను.

1రాజులు 22:22

యోహాను 8:44 – అబద్ధమునకు జనకుడు.

యోహాను 14:30 – సాతాను ఈ లోకాధికారి.

కార్య. 5:3 – అననీయ హృదయములో ప్రవేశించుట.

కార్య. 26:18 – సాతాను అధికారమునుండి దేవునివైపునకు తిరుగుట.

రోమా 16:20 – దేవుడు సాతానును కాళ్ళక్రింద చితుక ద్రొక్కించును.

IIకొరింథీ 5:5 – సాతానును అప్పగించుట.

IIకొరింథీ 2:11 – 'సాతాను మోసపరచకుండ..... క్షమించుట'

IIకొరింథీ 4:4 – సువార్త విషయములో గ్రుడ్డితనము కలిగించెను.

IIకొరింథీ 11:14 – సాతాను వెలుగుదూత వేషము ధరించెను.

IIకొరింథీ 12:7 – ముల్లు–సాతాను దూత.

ఎఫెసీ 2:2 – వాయుమండల అధిపతి.

ఎఫెసీ 4:27 – అపవాదికి చోటియ్యకుడి.

ఎఫెసీ 6:11 – అపవాది తంత్రములను ఎదిరించుట.

ఎఫెసీ 6:16 – దుష్టుని అగ్నిబాణములను ఆర్పవలెను.

కొలస్స 2:15

హెబ్రీ 2:14,15 – ప్రభువు మరణం ద్వారా సాతానును జయించెను.

Iథెస్స 2:18 – సాతాను పౌలును అభ్యంతర పరచెను.

IIథెస్స 2:9

ప్రకటన 16:14 – సూచక క్రియలు చేయును.

Iతిమోతి 1:20 – పౌలు వారిని సాతానుకు అప్పగించెను

I తిమోతి 3:6 – అపవాదికి కలిగిన శిక్ష.

Bible Mission HQ Guntur

| | | |
|---|---|---|
| Iతిమోతి 5:15 | - | త్రోవనుండి తొలగి సాతానును వెంబడించెను. |
| IIతిమోతి 2:24-26 | - | సాతాను ఇష్టము నెరవేర్చుటకు చెరపట్టబడినవారు. |
| హెబ్రీ 2:14 | - | అపవాదిని ప్రభువు మరణముద్వారా నశింపజేసెను. |
| యాకోబు 4:7 | - | అపవాదిని ఎదిరించిన పారిపోవును. |
| Iపేతురు 5:8 | - | అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా! అని తిరుగుచుండెను. |
| II పేతురు 2:4 / యూదా 6వ వచనము | - | పాతాళమందలి బిలములో నుండెను. |
| Iయోహాను 3:8 | - | అపవాది క్రియలను లయపర్చుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను. |
| యూదా 9వ వచనము | - | ప్రభువు నిన్ను గద్దించును. |
| ప్రకటన 9:11 | - | పాతాళపు దూత. |
| ప్రకటన 12:9 | - | ఘటసర్పము పడద్రోయబడెను. |
| ప్రకటన 12:12 | - | సమయము కొంచెమని క్రోధము గలవాడాయెను. |
| ప్రకటన 16:13 | - | ఘటసర్పము నోటినుండి అపవిత్రాత్మలు వచ్చుట. |
| ప్రకటన 20:2 | - | వెయ్యేండ్లు చెర (మట్టులేని గొయ్యి). |
| ప్రకటన 20:10 | - | అగ్నిగుండములో వేయబడెను. |

***దయ్యములను వెళ్ళగొట్టుటకు ప్రభువే అధికారమిచ్చెను:***

మత్తయి 10:1; మార్కు 16:17; లూకా 9:1; అపో.కార్య. 16:18; 19:12; విశ్వాసులు సాతాను నెదిరింపవలెను. రోమా 16:20; IIకొరింథీ 2:11; 11:3; ఎఫెసీ 4:27; 6:16; 2తిమోతి 2:26.

యాకోబు 4:7; Iపేతురు 5:8; Iయోహాను 2:13.

## 10. దుష్టుడైన సాతాను లక్షణములు

యోబు 1:6; మత్తయి 4:5,6 అహంకారము.


యోబు 1:9;2:4. ద్వేషించువాడు, అపకారబుద్ధిగలవాడు.

| | |
|---|---|
| 1 తిమోతి 3:6. | గర్విష్టుడు. |
| ఎఫెసీ. 2:2; 6:12. | దుష్టశక్తి. |
| 1యోహాను 2:13. | దుష్టుడు. |
| ఆది. 3:1; 2కొరింథీ 11:3. | కుయుక్తి, అపజయము గలవాడు. |
| 2కొరింథీ 11:14; ఎఫెసీ6:11 | వంచకుడు. |
| 1పేతురు 5:8. | క్రూరుడు. |

**సాతాను ఈ క్రింది వాటితో సరిపోల్చబడెను.**

| | |
|---|---|
| కీర్తన 91:3. | వేటగాడు. |
| మత్తయి 13:4. | పక్షి. |
| మత్తయి 13:25. | గురుగులు విత్తువాడు. |
| యోహాను 10:12. | తోడేలు. |
| 1పేతురు 5:8. | గర్జించు సింహము. |
| ప్రకటన 12:9. | ఘటసర్పము. |

## 11. సాతానుకు నిత్యమైన అపజయము విశ్వాసికి నిత్యమైన జయము:




యేసుక్రీస్తు ప్రభువు స్వయముగా దయ్యములను వెళ్ళగొట్టెను. మార్కు5వ అధ్యా॥; యెషయా 53వ అధ్యా॥

1) నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను.


2) మన యతిక్రమ క్రియలనుబట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీదపడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది.

Bible Mission HQ Guntur

3) నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషములను భరించి, తనకున్న అనుభవ జ్ఞానముచేత అనేకులను నిర్దోషులనుగా చేయును.

4) 'ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడిన వాడాయెను. అనేకుల పాపమును భరించుచు, తిరుగుబాటు చేసిన వారిని గూర్చి విజ్ఞాపనము చేసెను.'

"క్రీస్తుకూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడచుకొనునట్లు, మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు, ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను." 1పేతురు 2:21-23.




మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయమై జీవించు-నట్లు ఆయన తనశరీరమందు మన పాపములను మ్రానుమీద వేసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి. 'అందుకు యెహోవా ప్రజలలోనికి తాపకరములైన సర్పములను పంపెను; అవి ప్రజలను కరువగా ఇశ్రాయేలీయులలో అనేకులు చనిపోయిరి. కాబట్టి ప్రజలు మోషే యొద్దకువచ్చి- మేము యెహోవాకును, నీకును విరోధముగా మాటలాడి పాపము చేసితిమి; యెహోవా మా మధ్యనుండి ఈ సర్పములను తొలగించునట్లు, ఆయనను వేడుకొనుమనిరి. మోషే ప్రజలకొరకు ప్రార్థన చేయగా యెహోవా- నీవు తాపకరమైన సర్పమువంటి ప్రతిమను చేయించి స్తంభము మీద పెట్టుము; అప్పుడు కరవబడిన ప్రతివాడును దానివైపుచూచి బ్రతుకునని మోషేకు సెలవిచ్చెను. కాబట్టి మోషే ఇత్తడి సర్పమొకటి చేయించి స్తంభము మీద దానిని పెట్టెను.

అప్పుడు సర్పపుకాటు తినిన ప్రతివాడు, ఆ ఇత్తడి సర్పమును నిదానించి చూచినందున బ్రతికెను'. సంఖ్యా. 21:6-9.

1) 'అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును'. యాకోబు 4:7.

2) 'మీరు మేలు విషయమై జ్ఞానులును, కీడు విషయమై నిష్కపటులునై యుండవలెనని కోరుచున్నాను. సమాధానకర్తయగు దేవుడు సాతానును మీ కాళ్ళక్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును.'

**వివరము:** ఇత్తడి సర్పము సైతానుకు గుర్తు. ప్రభువు సిలువమీద నున్నప్పుడు, సైతానుకూడ ఆయన సిలువక్రింద అనగా ఆయన పాదముల క్రింద సిలువ వేయబడెను. గనుక సైతానుకు చాల బాధ. ప్రభువునకు కలిగిన బాధ పునరుత్థానముతో తీరిపోయెను గాని సైతానుకు కలిగిన బాధ, అంత్య దినమువరకు నుండును. నడుము విరుగగొట్టబడిన సర్పము ఎవరిని ఏమియు చేయనేరదుగాని తోక ఆడించుచుండును. దానిని చూచి పిల్లలు భయపడుదురు గాని పెద్దవారు భయపడరు.

సైతాను అట్టి సర్పమువంటిదై యున్నది. అయినప్పటికిని, ప్రజలను భయపెట్టుచున్నది. కాని భయపడనియెడల అది ఏమియు చేయజాలదు. క్రీస్తు ప్రభువు దాని నడుమును విరుగగొట్టెను. హవ్వ వద్దకు సైతాను, సర్పరూపమున వెళ్ళి మోసము చేసెనుగదా! అందుచేత సాతాను అను సర్పము, క్రీస్తుప్రభుని సిలువ సమయములో సిలువవేయబడెను. సంఖ్యా. 21వ అధ్యాయములో ఏమున్నదో వినండి: ఇశ్రాయేలీయులు పాపము చేయుటనుబట్టి తాపకరమైన సర్పములు కరచినందున వారిలో అనేకమంది చనిపోయిరి. ఇంతలో మోషే ఇత్తడితో ఒక సర్పమును జేసి, స్తంభమునకు అంటగొట్టెను. పాపము ఒప్పుకొనిన వారు దానిని చూచి- 'మనలను కరచిన పాము స్థంభమునకు అంటగొట్టబడెను, అది మనలను ఏమియు చేయలేదని నమ్మిరి. అందుచేత వారు బాగుపడిరి. *అలాగే మన పాపములు ప్రభువుమీద వేయబడినవి గనుక అవి మనలో ఇక లేవు. మనకేమియు భయములేదని నమ్ము వారికి పాప విముక్తి కలుగును.* మరియు మనచేత పాపము చేయించిన సైతాను, సిలువ వేయబడెను గనుక

అది ఇక కదల లేదు. అది మాకు హాని చేయజాలదు. మా పాపములను బట్టి మాకు కలుగు రోగాదుల వలనను, మాకు హాని రాదు అని అనుకొను వారికి పాప విముక్తి కలుగును. ఈ రెండు సిలువలు తలంచుకొని క్రీస్తుప్రభువును స్తుతించు వారికి మోక్షానందము కలుగును.

## 1. సైతాను శ్వాస

ప్రియులారా! మానవ సంతతి అంతటికి ఆదాము, హవ్వ అనువారే మొదటి తల్లిదండ్రులు. పొడపాము మన కాలిబొటన వ్రేలిమీద ఊదిన యెడల, ఆ విషము కాలంతటికి ఎక్కును. అలాగే సాతాను అను ఆది సర్పము, మన తల్లిని మోసపుచ్చుటవలన తన విషము ఆమె చెవిలోనికి ఊదెను. అది నేటివరకు అందరిలోనికి వచ్చియున్నది. అందుచేతనే నరులకు పాపాలోచనలు వచ్చుచున్నవి. ఆది దంపతులు దైవాజ్ఞను మీరినందువల్ల ఆరు దుష్ట ఫలితములు కలిగెను.

1) భార్య పాపముచేసి, అది తన భర్తకు అంటించెను.

2) దేవుడు తమ దిగంబరత్వము చూచునని వారు సిగ్గుపడిరి గనుకనే ఆకులను వస్త్రములుగా వాడుకొనిరి.

3) దేవుడు శిక్షించునని భయపడిరి.

4) ఒకరిమీద ఒకరు చాడీ చెప్పిరి.

5) దేవుడు మమ్మును క్షమించునని ఆయన కటాక్షముమీద ఆధారపడక, చెట్టుమీద ఆధారపడి దాని చాటున దాగిరి. కాపాడువాడు దేవుడేగాని చెట్టు కాదుగదా!

6) 'నాతో నుండుటకు నీవు నాకిచ్చిన ఈ స్త్రీయే, ఆ వృక్ష ఫలములు కోసి నాకియ్యగా నేను తింటిని' అని పురుషుడు దేవునితో చెప్పెను. పురుషుడు తన తప్పును ఒప్పుకొన్నాడుగాని నీవు నాకిచ్చిన స్త్రీ అనుట వలన దేవుని మీద నేరము మోపుచున్నాడు. పురుషుడు, స్త్రీ మీదను, దేవునిమీదను అనగా ఇద్దరి మీదను నేరము మోపెను. స్త్రీ కూడ తన తప్పు ఒప్పుకొనెను గాని సర్పముమీద నేరము మోపెను. సర్పముమీద నేరము మోపుట సబబుగానే యున్నది, గాని దేవుని మీద నేరము మోపుట గొప్ప పాపమైయున్నది. దేవుడు పురుషునికి స్త్రీని

నిచ్చుట నేరమైనదా? ఇదేమి చిత్రము! పాపము చేయించుటకు దేవుడు స్త్రీని ఇచ్చెనా? సహాయము చేయుటకే ఇచ్చెను.

*పాపఫలితములు వరుసగా చెప్పుచున్నాను: అంటించుట, దిగంబరత్వము, భయము, చాడీ, వృక్షము నాశ్రయించుట, దేవునిపై నేరము మోపుట,* ఈ ఆరును నేటివరకు మనుష్యులందరిలోనికి వచ్చియున్నవి. క్రీస్తుప్రభువు సిలువ మ్రానుమీద, మన పాపములను మనమీద లేకుండ తనమీద వేసికొనెను. అయినను మనము వాటిని జ్ఞాపకము చేసికొనుటవలన, వాటిని తెచ్చిపెట్టుకొను చున్నాము. భయపడుటవలన వాటిని తెచ్చి పెట్టుకొనుచున్నాము.

1) మనలో పాపములుండుట నేరమేగాని అది ఇతరులకు అంటించుట మరింత గొప్ప నేరము.

2) మనము సిగ్గుపడుట పాపమువలననే కలిగినది. వారు ఆకులను బట్టలుగా వాడుకొన్నారు. ఇవి పాపమును కప్పివేయుటకు లేక పరిహరించు కొనుటకు మానవులు చేయు స్వంత క్రియలకు గుర్తులైయున్నవి. స్వంత క్రియలవలన మనకు మేలుకలుగదు గాని, ప్రభువు మన నిమిత్తమై చేసిన క్రియలవలన మనకు మేలు కలుగును. 'మన నీతిక్రియలు మాసిన గుడ్డలవలె ఉన్నవని' యెషయా చెప్పుచున్నాడు.

3) తమ్మును ఎవరును గద్దింపకముందే, పాపము చేయువారు భయపడుదురు. వారి మనస్సాక్షియే వారిని గద్దించును.

4) మనుష్యులు అభివృద్ధిలోనికి రాకపోవుటకు, భయమే కారణమని కొందరు శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

5) మనుష్యులు నేరము చేసినప్పుడు 'తమది అంత గొప్పనేరము కాదు అనియు, ఇతరులది గొప్ప నేరమనియు ఋజువు పరచుటకై, ఇతరులమీద నేరము మోపుచున్నారు'.

6) కష్టకాలమందు దేవుని ఆశ్రయించుట వలన ఆ కష్టము తీరును. మరియు భయము, సిగ్గు పోవును. గాని చెట్టును ఆశ్రయించుట వలన అవి

పోవుగదా! మొదట దేవుని ఆశ్రయించుట మాని, మనుష్యులను మరియు వస్తువులను ఆశ్రయించుటవలన మేలు కలుగదు.

7) నేరము చేసినవాడు మానవుడు, దానికి కారకుడును అతడే. పాపమునకు కారకుడు కానటువంటి దేవునిమీద నేరము మోపుట దైవ ద్రోహమై యున్నది. *అన్ని పాపములు ఎప్పటికైనా వదలిపోవచ్చును గాని నైజపాపము వదలిపెట్టదు. 'పుండు మానినను మచ్చమానదు' అను ఒక లోకోక్తి కలదు.*

## 2. సైతాను క్రియలకు వ్యతిరేకమైన పని

1) స్త్రీ వలన మానవ సంతతికి పాపము వచ్చెను. దేవుడు మరియమ్మ అను ఒక స్త్రీలోనుండి ఆ పాపమును పరిహరింపగల రక్షకుని రప్పించెను. *దెబ్బకు దెబ్బ.* ఇది చూచుటవలన సాతానుకు బాధ, సిగ్గు కలుగక మానదు. గనుక సాతాను గుండెలో రాయి పడినది.

2) ఆదాము అను పురుషుడుకూడ పాపములో పడెను. స్త్రీకి ఆదరణగా క్రీస్తు ప్రభువు స్త్రీవలన జన్మించెను. *గనుక స్త్రీలందరు సంతోషించ వలసినదే.*

3) పురుషులకు ఆదరణగా క్రీస్తుప్రభువు పురుష రూపముతో జన్మించెను. గనుక పురుషులందరు సంతోషించవలసినదే. ఆదిలో స్త్రీ పురుషులకు జన్మమును కలుగజేసిన దేవుడు, ఇప్పుడు ఆ స్త్రీ పురుషులకు రక్షణ అను జన్మమును అనగా నూతన సృష్టిని కలుగజేసెను. దేవుని విజ్ఞానము యెదుట సైతాను జ్ఞానము ఏమి పనికి వచ్చినది? చదువరులందరు ఈ గొప్ప విషయము తెలిసికొని బలపడవలెను.

## 3. ఘర్షణ

1) **పురుషులు:** స్త్రీలారా! మీవల్లనేగదా! మీకును, మాకును గొప్ప కుమ్మరము వచ్చినది.

2) **స్త్రీలు:** స్త్రీ చెప్పినమాట పురుషుడు ఎందుకు వినవలయును? పురుషునిది నేరము కాదా! నిషేధవృక్ష ఫలము తినకూడదని దేవుడు పురుషునికి చెప్పలేదా?

3) పురుషులు – స్త్రీ పండ్లు తెచ్చియుండని యెడల పురుషుడు తినునా?

4) స్త్రీలు– స్త్రీ పండ్లు తెచ్చి ఇచ్చినప్పుడు, దేవుడు తినవద్దన్న పండ్లు ఎందుకు తెచ్చినావని పురుషుడెందుకు అడుగలేదు?

5) పురుషులు– దేవుడు స్త్రీని పురుషునికి సహాయముగా ఇచ్చెను. గనుక నా సహాయార్ధమై స్త్రీ, పండ్లు తెచ్చినదనుకొని అడుగలేదు.

6) స్త్రీలు– నేడుభోజన సమయమందు భార్యలు క్రొత్త కూర వడ్డించినప్పుడు, ఇదెక్కడిది? ఇదేమి కూర? అని పురుషులు అడుగుట లేదా? ఆ పురుషుడు ఎందుకు అడుగలేదు!

## 4. సమాధానకర్త

ఇప్పుడు సమాధానకర్తయైన క్రీస్తుప్రభువు వచ్చి, సమాధానము చెప్పును. మీరిద్దరు వాదించుకొనుటవలన ఏమి ప్రయోజనము? స్త్రీల పక్షముగాను, పురుషుల పక్షముగాను ఉండువారు ఎవరును లేరు గనుక నేను వచ్చినాను. స్త్రీలలోనుండి జన్మించుటవలన స్త్రీల పక్షముగాను, పురుష రూపముగా జన్మించుట వలన పురుషుల పక్షముగాను, నేను ఈ లోకమునకు వచ్చినాను. సమాధానముగా ఉండండి, వాదించకండి, పోట్లాడకండి. వివాహకాలమందు నేను ఇద్దరిని సమముగానే దీవించినాను. *'దేవుడు జతపరచిన వానిని నరుడు విడదీయ కూడదని'* మీరు గ్రంథములో చదువుకొని యున్నారు. 'మీ ఘర్షణను బట్టి చూడగా, మీరు ఒకరిలోనుండి ఒకరు విడిపోయినట్లు కనబడుచున్నది గదా!' అని ప్రభువు చెప్పినట్లున్నది.

## 5. సిలువ తలంపు

'ప్రాను దగ్గరకు వెళ్ళి దాగుకొనుటవలన, ప్రాను శరణుజొచ్చినట్లు గదా? కాబట్టి దానికి వ్యతిరేకమైన కార్యమొకటి చేసితిని. అదేమనగా సిలువ ప్రానుపైన వ్రేలాడి, మీ విముక్తి కొరకు, నా రక్తమును ధారపోసితిని గనుక చెట్టువద్ద కాక, నా సిలువయొద్ద దాగుకొనండి. అప్పుడు మీకు హానిరాదు' అని ప్రభువు చెప్పినట్లు యున్నది. "మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను ప్రానుమీద మోసికొనెను." 1పేతురు 2:24.

## సైతాను నెదిరించు పద్యము

సీ॥ సాతాను సర్పమా! । సర్వకార్యములందు
శ్రమలతో కూడిన । చావు నీకు
నరులను బాధించు । నపుడెల్ల వ్రాతలో
పడిన శిక్షలు పయి । బడును నీకు
యూఫ్రటీస్ నది వద్ద । ఉన్న భూతాలకు
కలిగిన దుర్గతి – కలుగు నీకు
విజ్ఞప్తి పత్రిక । వెల్లడించక ముందె
కంపము భీతియు । కలుగు నీకు
తే॥గీ॥ హేడెస్సను మాట తలనొప్పి । హింస నీకు
హర్మ గెద్దోను యుద్ధం । హడలు నీకు
కడతరుగని గొయ్యియె మొట్టి । కాయ నీకు
అగ్నిగుండ మనంత ని । రాశ నీకు

## సాతాను నెదిరించు కీర్తన

పోపోవె ఓ సాతానా – జాగ్రత్త సుమా – నీ గుట్టు మాకు చిక్కెను–
= నిను చితుక గొట్టి– ఘనసూత్రాలు మాకు
మా తండ్రి నేర్పించి – మము సిద్ధపరచెను ॥పోపోవె॥

1. ఆదికాలము మొదలుకొని – నేటివరకు – ఆడితివి
బహు నేర్పుగా = అద్భుత రీతిగా – ఆత్మతండ్రి నీదు–
ఆయువు పట్టును – అందించెను మాకు ॥పోపోవె॥

2. మట్టులేని గొయ్యిగా – నీ కష్టమెల్లా – గట్టెక్కె
పని లేదుగా = సమయము లేదని – సన్నిధిపరులను–
చెదర గొట్టుటకీవు – కనిపెట్టుకొన్నావు ॥పోపోవె॥

3. కరుణా సముద్రుండైన – త్రిత్వదేవుని – కృప మమ్ము
వెంబడించు = ఏదోఒకసూత్రాన – రక్షించు చుండును–
భక్షించు నీ చేతికి – చిక్కనిచ్చునా మమ్ము ॥పోపోవె॥

# సైతాను నెదిరించు సూత్రములు

## (ప్రార్థనలు, స్తుతులు, ఎదిరింపులు)

"అపవాదియొక్క క్రియలను లయపరచుటకే
దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" 1యోహాను 3:8.


గ్రంథకర్త :

**యం. దేవదాసు అయ్యగారు**



గుంటూరు - 2024 చందా : రూ/- 20-00



Bible Mission HQ Guntur

## గుంటూరు నందు

| | | | | |
|---|---|---|---|---|
| ప్రథమ | ముద్రణ | 1967 | ప్రతులు | 1000 |
| రెండవ | " | 1969 | " | 1000 |
| మూడవ | " | 1971 | " | 1000 |
| నాల్గవ | " | 1974 | " | 2000 |
| ఐదవ | " | 1977 | " | 2000 |
| ఆరవ | " | 1979 | " | 2000 |
| ఏడవ | " | 1980 | " | 4000 |
| ఎనిమిదవ | " | 1982 | " | 5000 |
| తొమ్మిదవ | " | 1986 | " | 6000 |
| పదవ | " | 1987 | " | 10,000 |
| పదనొకండవ | " | 1990 | " | 10,000 |
| పండ్రెండవ | " | 1992 | " | 10,000 |
| పదమూడవ | " | 1994 | " | 10,000 |
| పద్నాలుగవ | " | 1996 | " | 10,000 |
| పదిహేనవ | " | 1997 | " | 10,000 |
| పదహారవ | " | 1999 | " | 10,000 |
| పదిహేడవ | " | 2001 | " | 15,000 |
| పద్దెనిమిదవ | " | 2003 | " | 15,000 |
| పంతొమ్మిదవ | " | 2005 | " | 15,000 |
| ఇరువైయవ | " | 2007 | " | 5,000 |
| ఇరువై ఒకటవ | " | 2008 | " | 10,000 |
| ఇరువై రెండవ | " | 2009 | " | 13,000 |
| ఇరువై మూడవ | " | 2011 | " | 15,000 |
| ఇరువై నాల్గవ | " | 2012 | " | 10,000 |
| ఇరువై ఐదవ | " | 2013 | " | 5,000 |
| ఇరువై ఆరవ | " | 2014 | " | 10,000 |
| ఇరువై ఏడవ | " | 2015 | " | 10,000 |
| ఇరువై ఎనిమిదవ | " | 2016 | " | 10,000 |
| ఇరువై తొమ్మిదవ | " | 2018 | " | 10,000 |
| ముప్పయవ | " | 2019 | " | 8,000 |
| ముప్పది ఒకటవ | " | 2020 | " | 5,000 |
| ముప్పది రెండవ | " | 2021 | " | 5,000 |
| ముప్పది మూడవ | " | 2022 | " | 6,000 |
| ముప్పది నాల్గవ | " | 2023 | " | 3,000 |
| ముప్పది ఐదవ | " | 2024 | " | 5,000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్: 9949121777.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ప్రశంస | – | i |
| ప్రవేశము | – | ii |
| విషయసూచిక | – | iii - iv |
| దైవలక్షణముల స్తుతి | – | v - vi |
| శిరచ్ఛేదనమునకు శిరచ్ఛేదన | – | vii - ix |
| I. ప్రారంభ ప్రార్థన | – | 1 |
| 1. సాతాను నెదిరించు ప్రార్థనలు | – | 1 |
| 2. సాతాను నెదిరించు దైవస్తుతులు – స్తుతిదీపము | – | 5 |
| 3. సాతాను ఎదిరించుట | – | 8 |
| 1) పిశాచి | – | 13 |
| 2) సాతానుపై జయము | – | 15 |
| 3) సాతానుకు మారుమనసులేదు | – | 20 |
| 4) సాతాను నేరములు మోపలేడు | – | 21 |
| 5) అపవాది, అపరాధి | – | 22 |
| 6) సాతానుకు నాశనము : సాతానుకు నిత్యనాశనము – ప్రభువునకు నిత్యస్తుతి | – | 24 |
| 7) యేసుప్రభువు రక్షకుడు | – | 26 |
| 8) నిరీక్షణ సంఘము | – | 27 |
| 9) ఇతర మతస్థులు | – | 28 |
| 10) ఇతర మిషనులు, బైబిలుమిషను | – | 29 |
| 11) హేడెస్సు | – | 30 |
| 12) బైబిలు | – | 31 |
| 4. దయ్యములను వెళ్ళగొట్టే దైవ ప్రార్థనాంశములు | – | 31 |


Bible Mission HQ Guntur

5. వాయుమండలములోని ప్రార్థన పుస్తకములు – 33
6. పరిత్యాగ పత్రిక – 34
7. సంగ్రహ వాక్యావళి – 35
8. నరహస్త ఖడ్గప్రార్థన – 35
9. ముగింపు ప్రార్థన – 36
II. **అనుబంధము** – 39
1. సాతాను నెదిరించు ప్రార్థనలు – 39
2. సాతాను నెదిరించు దైవస్తుతి – 41
3. సాతాను ఎదిరింపులు – 41
4. సాతాను నెదిరించు కీర్తనలు – 42
5. సాతాను నెదిరించు గమనికలు – 42
6. సాతానును లొంగదీయుట – 42
7. సాతాను నెదిరించు ముఖ్య సూత్రములు – 43
8. సాతాను నెదిరించు రిఫరెన్సులు – 43
9. సాతాను నెదిరించు వాక్యములు – 45
10. దుష్టుడైన సాతాను లక్షణములు – 47
11. సాతానుకు నిత్యమైన అపజయము – విశ్వాసికి నిత్యమైన జయము – 48
i) సాతాను శ్వాస – 51
ii) సాతాను క్రియలకు వ్యతిరేకమైన పని – 53
iii) ఘర్షణ – 53
iv) సమాధానకర్త – 54
v) సిలువ తలంపు – 54

Bible Mission HQ Guntur

# ప్రశంస

దేవుడు దేవదూతలను కలుగజేసెను. వారు స్త్రీలు కారు, పురుషులు కూడా కారు. వారు ఆత్మ స్వరూపులు. వారిలో ఏడుగురు ప్రధాన దూతలుండిరి. వారిలో ఒకరు లూసీఫర్. ఇతడు అనాదిలో దైవకార్యములను జాగరూకతగానే చేసియుండెను గాని వానిలో దుర్బుద్ధికలిగి, దేవుని నెదిరించినందున, అతడు తన అంతస్తునుండి దేవునిచేత పడద్రోయబడెను. అప్పటినుండి అతడు సాతానను పేరున తిరుగులాడు చుండెను. అంతేగాక అప్పటినుండి దేవునికి విరోధియై, దేవునియొక్క పరిశుద్ధ పనిని పాడుచేయవలెనని, ఆది దంపతులైన ఆదాము, హవ్వల యొద్దకు వచ్చి, తనలోని దుర్బుద్ధిని తన యుక్తిగల జ్ఞానముచేత వారిలో ప్రవేశపెట్టి; దేవుని పోలికకు, దేవునికి, దేవుని సహవాసమునకు వారిని దూరము చేసెను. ఇట్లు పాపము వృద్ధికాగా, రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువు తన బలి అర్పణ ద్వారా సాతానును చితుక త్రొక్కి పాపులను రక్షించెను. యేసుప్రభువు తన సిలువ రక్తము ద్వారా సమస్త పాపముల నుండి రక్షించిన సంఘమునకు, సాతానును చితుక త్రొక్కే సర్వాధికారమిచ్చెను. ఈ కడవరి కాలములో సంఘ క్షేమము కొరకు యం. దేవదాసు అయ్యగారి ద్వారా, సంఘమునకు అందింపజేసిన ఈ మర్మమునుబట్టి దేవునికి స్తోత్రములు.

చెడుగును ప్రపంచములోను, సమస్త ప్రజలలోను, మనలోను ప్రవేశపెట్టిన సాతానును, ఈ సూత్రముల ద్వారా రోషము తెచ్చుకొని ఎదిరించి, సాతానుపై జయము పొందుదురు గాక!

యం. దేవదాసు అయ్యగారి సలహాపై ఈ సూత్రములన్నింటిని ప్రోగుచేసి, వర్గీకరించిరి. ఇవి ఒకరిని చూచి ఒకరు వ్రాసికొన్నందున కొన్ని మార్పులుండును, కొన్ని మాకు దొరుకనివి కూడ ఉండును. అట్టివానిని మాకు తెలియజేసిన యెడల తరువాత ముద్రణ సమయమున సరిచేయుదుము. దేవుడు మిమ్ములను దీవించును గాక! ఆమేన్.


ప్రభుని దాసుడు

**రెవ. జె. శామ్యేల్ కిరణ్**

ప్రసిడెంట్, బైబిలుమిషను.

బేతేలు గృహము, రైలు పేట,

గుంటూరు - 522 001.

# ప్రవేశము

సాతానును ఎదిరించకపోయిన యెడల మన దేవునిరాజ్యము వృద్ధిలోనికి రాదు. అన్నిటికిని వాడు అడ్డు వచ్చుచుండును. సాతాను ప్రతిదినము శోధించు చుండును గనుక అతనిని మనము సాధించవలెను. కొన్ని విషయములు ఎత్తి, వాడిని సిగ్గుపరచ వలెను. బాణములు అనగా, సాతాను నెదిరించు సూత్రములు పుస్తకములోనే వ్రాసియుండిన యెడల వానికి భయము తక్కువ. ఒక్కొక్కటి చదివి వదిలిన వానికి భయము. వేటకాని సంచిలో బాణములు ఉండిన ఏమి ప్రయోజనము? వాటిని తీసి విల్లెక్కుపెట్టి వదలవలెను. అనగా సాతానును జయించు సూత్రములను చదువుటవలన వానికి భయము కలుగును. తుదకు వాని రాజ్యము కూలిపోవును.

క్రీస్తుప్రభువు దైవసన్నిధి కూటములోనికి వచ్చి కనబడుచున్నారు గనుక సాతాను కూడ– 'ఆయన కనబడితే నేనెందుకు కనబడకూడదు' అని వచ్చును. భయపడవద్దు, వాడు ప్రభువు సెలవుమీద వచ్చి కనబడును గాని స్వయముగా రాలేడు. వాడువచ్చి మన మనోనిదానమును కుదరనీయడు, పిచ్చి పిచ్చి ఆలోచనలు పుట్టించును, అవసరము లేని సంగతులు చెప్పును. ఇవన్నియు పిశాచి పనులే. కాబట్టి సాతాను శోధించినప్పుడు, 'దేవా! నా బలము కొరకు, నా జయము కొరకు, నా బహుమానము కొరకు సాతానును రానిచ్చినావు గనుక నీకనేక స్తోత్రములు' అంటే వాడు పారిపోవును. ఒకరు వెళ్ళుచుండగా మరియొకరు రాయి విసిరి కొట్టెను. గాని రాయి విసిరిన అతడు కనబడనంత మాత్రమున అతడు లేనట్టేనా? అలాగే సాతాను కనబడక పోయినను, వాని శోధన కనబడుచున్నది. అందువలన వాడు కనబడినట్టే. సాతానుకు కోపమువచ్చి చెలరేగినపుడు, మన సన్నిధి కూటస్థులను బాధించును, విశ్వాసులను బాధించును. అందుచేత మనము చెలరేగి, మన సత్కార్యములను వృద్ధి చేసికొనవలెను.

**షరా:** బోధకులు నేర్పినవేగాక శోధన కాలమందు, పరిశుద్ధాత్మ తండ్రి అందించిన ఎదిరింపులు వాడుట కూడ అవసరము గనుక వాడిని రోషముతో ఎదిరించవలెను.

# దైవలక్షణముల స్తుతి

1. దేవా! నీవు అనాది వ్యక్తివై యున్నావు. నిన్ను ఎవ్వరూ కలుగజేయలేదు. నీయంతట నీవే యున్నావు గనుక నీకు వందనములు.

2. దేవా! నీవు వెలుగై యున్నావు. అందుచేతనే సూర్య, చంద్ర, నక్షత్రములకు వెలుగునిచ్చినావు. జీవులలో కండ్లకు వెలుగునిచ్చినావు గనుక నీకు స్తోత్రములు.

3. దేవా! నీవు జ్ఞానమై యున్నావు. అందుచేతనే దేవదూతలకు, మనుష్యులకు, జీవరాసులకు జ్ఞానమిచ్చినావు. అట్టి జ్ఞానమువలన అనేక మర్మములు తెలియుచున్నవి. మా జ్ఞానమునకు నీవు బైలుపడినావు గనుక నీకు స్తుతులు.

4. దేవా! నీవు ప్రేమవై యున్నావు. గనుక జీవరాసులు ఒకదాని నొకటి ప్రేమించుకొనుచున్నవి. అలాగుననే మనుష్యులు కూడ ఒకరినొకరు ప్రేమించు కొనుచున్నారు. గనుక నీకు స్తుతులు.

5. దేవా! నీవు న్యాయమై యున్నావు గనుక నీవు క్షమించేవాడవు. అయినప్పటికిని తప్పుచేసిన వారిని శిక్షించి, క్షమించేవాడవు గనుక నీకు ప్రణుతులు.

6. దేవా! నీవు పరిశుద్ధుడవై యున్నావు. అందుచేత లోకములో పాపము ఉన్నప్పటికిని, పరిశుద్ధత కూడ ఉన్నది. వర్షజలములో, కాయలలో పరిశుభ్రత కనబడుచున్నది. మనుష్యులలో పాపమున్నప్పటికిని పరిశుద్ధత కూడ ఉన్నది గనుక నీకు నమస్కారములు.

7. దేవా! నీవు శక్తివై యున్నావు. కాబట్టి మానవులకు, జీవరాసులకు శక్తి ఇచ్చినావు. గనుక వారు నడువగలరు, పనిచేయగలరు. గనుక నీకు మంగళ స్తోత్రములు.

8. దేవా! నీవు సర్వవ్యాపివై యున్నావు. అందుచేతనే, అన్నిచోట్ల నీ ప్రభావము అనగా ప్రేమ, జీవము, పరిశుద్ధత, నీ పని, నీ కాపుదల కనబడు చున్నది. గనుక నీకు నిత్య మంగళ స్తుతులు.

9. దేవా! నీవు నిరాకారుడవై యున్నావు. అందుచేతనే పాపులమైన మాకు కనబడవు. కనబడని తండ్రివి అయినప్పటికిని, దర్శనములలో కొందరికి, స్వప్నములలో కొందరికి కనబడుచున్నావు గనుక నీకు హృదయపూర్వక వందనములు.

10. దేవా! నీవు స్వతంత్రుడవై యున్నావు, స్వేచ్ఛాపరుడవై యున్నావు. నీకు ఎవ్వరునూ సలహా ఇయ్యనక్కరలేదు. అన్నియు నీ ఇష్టప్రకారమే చేయగలవు. గనుక నీకు వందనములు.

**షరా:** దేవా! నీయొక్క దివ్యలక్షణములు, దేవదూతలకు, మనుష్యులకు ఇచ్చినావు గనుక స్తోత్రములు. దేవదూతలలో ఒక దూత పాపములో పడి, నీ సద్గుణములు లేకుండా చేసికొన్నది. అలాగే మనుష్యులు పాపములో పడి, నీ గుణములు చాలవరకు పోగొట్టుకొనుచున్నారు. అయినను నీవు వారి యెడల దీర్ఘశాంతము కలిగియున్నావు. గనుక నీకు వందనములు. మరియు ఓ దేవా! నిన్ను అడిగే వారికి నీ శక్తులు దయచేయుదువు గనుక నమస్కారములు. దేవా! నీ ప్రియ కుమారుడైన యేసుక్రీస్తును లోకమునకు పంపించి, ఆయనలో నీ గుణములు బయలు పర్చినావు గనుక నీకు అనేక స్తుతులు. మరియు దేవా! సృష్టిలోని వస్తువులను పరీక్షించిన నీ సుగుణములు అందులో ఉన్నవి గనుక నీకు స్తుతులు. మరియు దేవా! నిన్ను నమ్మినవారిలో ఉన్న దుర్గుణములు దూరముగా తీసివేసి, మోక్షమునకు చేర్చుకొనుచున్నావు. అక్కడ శాశ్వతముగా వారు నీ దివ్యలక్షణములను అనుభవిస్తున్నారు. గనుక నీకు మంగళ స్తోత్రములు.

# V

# శిరచ్ఛేదనమునకు శిరచ్ఛేదన

1) ప్రధాన దూతయొక్క మనస్సులో (శిరస్సులో) అనాదిలో, 'దేవునితో తాను సమానమను' చెడుతలంపు పుట్టించు కొన్నాడు. ఇది అతని శిరస్సులోనిదే.

2) అతడు దైవ సంకల్పమును భిన్నము చేయుటకు, హవ్వలో దైవాజ్ఞకు విరుద్ధమైన తలంపు పుట్టించినాడు. ఆ తలంపు అతని శిరస్సులోనుండి వచ్చినదే.

3) ఆదాము, హవ్వలను శాపగ్రస్తులనుగా చేయవలెననునది, అతని శిరస్సులోనిదే.

4) ఎన్ని పర్యాయములు మానవులలో పాపములను చేయు కోరిక పుట్టు-చున్నదో, అన్ని పర్యాయములు అది సాతానుయొక్క శిరస్సునుండి వచ్చుచున్నదని గ్రహింపవలెను. పొడపాము మనుష్యుని బొటనవ్రేలిమీద ఊది, పుట్టలోనికి పోయినప్పటికిని, ఆ ఊపిరి శరీరమంతా వ్యాపించి కుళ్ళిపోవును. అలాగే ఎప్పుడో సాతాను ఊదిన పాపము నేటివరకు వచ్చుచున్నది. ఇది అతని శిరస్సులోనిదే.

5) పది యాజ్ఞలను జ్ఞాపకము చేసికొనగా ఏమి తేలుచున్నది? దైవాజ్ఞలకు విరుద్ధమైన పాపములు చేయవలెనను కోరిక మనిషిలో పుట్టుచున్నది. అది సాతానుయొక్క శిరస్సులోనిదే.

6) దేవుడు లేనేలేడను తలంపు, సాతాను కొందరిలో పుట్టించినందున వారు నాస్తికులైరి. ఆ తలంపు సాతానుయొక్క శిరస్సునకు సంబంధించినదే.

7) దేవుడు చేసిన ఉపకారములను తలంచుకొని, స్తుతిచేయుటకు సిద్ధపడి కూర్చున్న విశ్వాసియొక్క హృదయములోనికి వెళ్ళి, స్తుతిచేయకుండ ఆపుచేయు వాడు సాతాను. కష్టములు కలిగినప్పుడు అతడు దేవునిమీద విసుగుదల పుట్టించి స్తుతి జరగనీయడు. ఒక్కడే కుమారుడైయుండగ, 'ఆ బిడ్డను కూడ దేవుడు

తీసికొనినాడు, ఓర్వలేక పోయినాడను' తలంపు పుడితే ఎట్లు స్తుతి చేయగలరు? ఆ చెడ్డ తలంపు సాతానుయొక్క శిరస్సునకు సంబంధించినదే.

8) ఇంటిలోనే ఉండి ప్రార్థన చేసికొంటే చాలదా! గుడికెందుకు వెళ్ళవలెను? అను తలంపు కొందరికి కలుగును. ఇదికూడ సాతాను శిరస్సుకు సంబంధించినదే.

9) చదువుకొన్న పిల్లలలో కొందరు –'మేమెందుకు తల్లిదండ్రుల మాట, పెద్దల మాట వినవలెను? ఇతరులెంత పెద్దవారైనప్పటికిని మేమెందుకు వందనము చేయవలెను'? అని కొంతమంది పిల్లలు, తమ ఇష్ట ప్రకారముగా సంచరింతురు. ఇటువంటి తలంపు సాతాను శిరస్సులోనిదే.

10) తిట్టుట, కొట్టుట, చంపుట మొదలైనవి మానవులలో కొందరియొద్ద నుండు దుర్గుణములు. ఇవి కూడ సాతాను శిరస్సులోనివై యున్నవి.

11) కుటుంబ సంబంధమైన కలహములు, ఆపదలు, పాపములు సాతాను శిరస్సు తెచ్చిపెట్టినవే.

12) ఆకలివేస్తే ఒకరి ఇంటిలోనివి తీసికొని తింటే ఏమి తప్పు? అని కొందరు దొంగతనము చేయుదురు. ఇదికూడ సాతానుయొక్క శిరస్సుకు అన్వయించినదే.

13) ఒకరిని అల్లరిపెట్టుచు, అతని తప్పును బైటపెట్టు గుణములు చాలమందిలో నున్నవి. దాని జన్మస్థానము సాతానుయొక్క శిరస్సు (అన్ని అబద్ధములు సాతానుకు సంబంధించినవే).

14) పది యాజ్ఞలలో నున్నటువంటి పాపములే కాక, బైబిలులో ఇతరచోట్ల ఉదహరించి యున్న పాపములు అతని శిరస్సులోనివే.

15. బైబిలులో ఉదహరించియున్న పాపములే కాక మన కాలమువరకు వస్తూయున్న, క్రొత్త క్రొత్త పాపములు గూడ సాతాను శిరస్సు లోనివే.

16) దేవునిరాజ్యము భూమిమీద వ్యాపింపబడ కుండునట్లుగా అడ్డములు బెట్టుట, సాతాను యొక్క శిరో కార్యములే.

17) మహా ముఖ్యముగా క్రీస్తు సంఘమును నమ్మకుండ చేయువాడు అపవాది. దీనిలో అతని శిరస్సునకు ఎక్కువ సంబంధము కలిగియున్నది.

18) పాపమును విసర్జించుట, రక్షణను పొందుట, రాకడకు సిద్ధపడుట అను ఈ మూడును వట్టివే అనిపించుట, అతని శిరస్సుయొక్క పని.

19) పరలోకము, నరకలోకము లేవు. హేడెస్సు లేదనిపించుట అతని శిరో వృత్తి.

20) ఇవిగాక శాఖోపశాఖలుగా నున్నటువంటి పాపములు అనేకములున్నవి. అవికూడ అతని శిరస్సునకు సంబంధించినవే.

21) సాతాను, అతని చెడ్డదూతలు అనగా 'భూతములున్నవి' అను బోధ వట్టిదే అనిపించుట అతని పని.

22) ఆ పైన ఉదహరించిన సాతాను యొక్క దురాలోచనలు మాత్రమేగాక కర్ణ దోషములు, నేత్ర దోషములు, హస్త దోషములు, పాద దోషములు ఈ మొదలైనవి కూడ అతని శిరస్సుయొక్క పనులే.

23) పైన వ్రాసియున్నవన్నియు కలిసి, సాతాను యొక్క శిరస్సగును. అపవాదికి శరీరము లేదు, మన శిరస్సు వంటి శిరస్సు లేదు. అయినప్పటికిని నిరాకారముగా నుండు, ఈ ఇరవై మూడు దుర్గుణములున్నవి. **అవియే అతని శిరస్సు.**

***గమనిక:*** *భయంకరమును, పాపభూయిష్టమునైన ఈ సాతానుయొక్క శిరచ్ఛేదనము చేయుటకై, ప్రతి క్రైస్తవుడు ఈ ప్రార్థన చేయుట అవసరము.*